# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

ఫిబ్రవరి 2025

వెల : రూ. 10.00



## శ్రీ కాళీవనాశ్రమమునందు నిర్వహించిన శ్రీ సద్గురు మహరాజ్ వారి 36వ వార్షిక పుణ్యారాధన మహోత్సవ దృశ్యములు



దీక్షా స్వీకరణ



అఖండ జ్యోతి ప్రజ్వలన



గురుచరిత్ర ప్రవచనము



సద్గురు దేవులకు లక్ష నామార్చన

# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ

సంపుటి 44 సంచిక 6
పేజీలు 44
ఫిబ్రవరి 2025

5సం॥ల చందా రూ. 500
2సం॥ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

**బ్యాంక్ డ్రాఫ్ట్** Y.S.C.K.P.M **చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా**
**మేనేజరు**
**సమర్థ సద్గురు మాగజైన్**
**శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు**
**గుంటూరు జిల్లా**

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**

దాశరథీ శతకము ............................ ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట.................................... ............ 8
నిష్కామ కర్మ ఫలం......................................10
భీమవరం...................... ...................... ..............12
శ్రీ మాతాజీవారి నూతన సంవత్సర ఆశీస్సులు...................14
హనుమత్తత్త్వం..................................................17
భగవద్గీత సాధన దీపిక ............................19
నమ్మకం .......... .............. ........ ........ ..... ........21
బిల్వదళం - మోక్ష ఫలం....................... ......25
నారద భక్తి సూత్రములు ................ ..............27
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు ......30
మనశ్శతకము ...................................................32
నిరీక్షణ ....................................................................33
శ్రీ గురుగీత .......................................... ........35
అన్నదాతవయ్యా!................................................37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....38
విష్ణు కథలు ....... ............................ ....................40

## దాశరథీ శతకము - భద్రాచల రామదాసు

55) **దీక్షవహించి నాకొలది దీనుల నెందఱి గాచితో జగ**
**ద్రక్షక తొల్లియా ద్రుపద రాజతనూజ తలంచినంతనే**
**యక్షయమైన వల్వలిడి తక్కట నామొఱజిత్తగించి**
**ప్రత్యక్షము గావవేమిటికి దాశరథీ కరుణాపయోనిధీ!**



భావము - జగద్రక్షణమనే దీక్ష వహించి నావంటి దీనులనెందరినో కాచిన లోక రక్షకుడవైనటువంటి శ్రీరామా! ద్రుపద రాజ తనయ మొర వినిన వెంటనే అక్షయమైన వలువలనిచ్చి కాపాడిన రీతి నన్ను కూడా కాపాడుము. నా ప్రార్థనను కూడా విని సాక్షాత్కరించుము.

*ఆసక్తి అంటే ఏమిటి? అది మన సాధనకు ఎలా అవరోధాన్ని కలిగిస్తుంది?
*తిరుమలేశుని నగలు దొంగిలించారని ఏ భక్తునిపై నిందారోపణ జరిగింది?
*సీతారామయ్యగారి కేసులో తీర్పు చెప్పిన జడ్జిగా వచ్చినదెవరు?
*గోపికలు ఎవరి సుఖం కోసం నిరంతరం పరితపించారు?
*ఆటో నడిపే షేక్ బాజీ జ్వరం ఐదు నిమిషాలలో ఎలా తగ్గింది?
*శ్రీ బాబూజీ మహరాజ్ వారు తమ అవతారాన్ని ఎందుకు చాలించారు?
*శుక్ల కృష్ణ గతులకు ప్రత్యక్ష సూచికగా కనిపించే స్వామి ఎవరు?
*కిరాతునికి నరసింహస్వామి దర్శనం ఎలా లభించింది?
*గురుదేవుల వద్ద మనస్సు ఎందుకు దాచకూడదు?
*పరస్త్రీల పైన నీచదృష్టి కలుగకుండా ఉండాలంటే ఏంచేయాలి?

***సమాధానాలు లోపలి పేజీలలో............................***

# శ్రీ బాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

25-4-1981 - ఈరోజు ఉదయం వసిష్ఠాశ్రమంలో శ్రీబాబూజీ భక్తులకు దర్శనం ఇచ్చారు. డాక్టరు రాజుకోసం ఎవరో పేషంట్ తాలుకు వాళ్ళు వచ్చారు. శ్రీబాబూజీ మాట్లాడుతూ "చూడు డాక్టర్! స్వధర్మం ఆచరించాలి. అది ఆచరిస్తూ మనస్సు ఇక్కడ ఉంచాలి. అంతేగాని స్వధర్మం మానేసి ఇక్కడే కూర్చుంటానంటే నాకిష్టం ఉండదు. అది నేను సహించను. మీరు ఇలా చేశారంటే నేను ఇలా రావడం మానేస్తాను" అన్నారు.



"గృహస్థునికి, సన్యాసికి తేడా ఉంది. గృహస్థు తన కర్మ చేస్తూ పరమాత్ముని యందు మనస్సు లగ్నం చేస్తే తరిస్తాడు. కాని సన్యాసి అలా కాదు. అతనికి స్వధర్మం అనేది వేరే ఉండదు. అతని మనస్సు అన్ని వేళల పరమాత్ముని యందే నిలిచి ఉండాలి. ప్రాపంచిక వ్యామోహాలకు ఆకర్షింప బడరాదు. అలాగని గృహస్థు ప్రాపంచిక వ్యామోహాలకు దాసుడవ్వాలని కాదు. సంసారంలోఉంటూనే దృష్టి మాత్రము భగవంతునిపై నిలపాలి. 'వృద్ధనారీ పతివ్రతా' అన్నారు. అంటే వృద్ధనారి కాకపోతే పతివ్రత కాదన్నమాటే కదా! ఇలా ఉంటాయి మన శాస్త్రాలు.

బ్రహ్మచర్యము అవలంబించే సన్యాసికి మనస్సు నిర్మలంగా ఉంటుంది. కాని బ్రహ్మచర్యమును అవలంబించని వాడికి స్త్రీని చూడగానే నీచ దృష్టి కలగవచ్చు. మాతృభావం మాత్రం కలగదు. అది భావనలో లోపం. ఆ భావన తొలగిపోవాలంటే బ్రహ్మచర్యం అవలంబించాలి. దుర్యోధనుని పుత్రుడైన లక్షణ కుమారునికి శరీరంపై మచ్చ వచ్చింది. ఈ కథ మీకందరికీ తెలిసిందే కదా. మహారాజులు, సామంతులు పండితులు, ఋషులు, మునులు భీష్ముడు, ద్రోణుడు ఒకరేమిటి నారదాది మహర్షులు ఎందరో సభకి విచ్చేసినా లక్ష్మణ కుమారుని మచ్చ పోవటానికి పంపిన తాంబూలాన్ని స్వీకరించటానికి ఏ ఒక్కరికి ధైర్యం చాలలేదు. అది వారి బ్రహ్మచర్యానికి పరీక్ష కాబట్టి వారిమీద వారికే నమ్మకం లేక భయపడతారు. కాని శ్రీకృష్ణపరమాత్ముడు ఆ తాంబూలాన్ని స్వీకరించగానే ఆ మచ్చ తగ్గిపోయింది. కౌరవులంతా ఆశ్చర్యపోతారు.

ఇది ఏదో కృష్ణపరమాత్ముడు చేసిన ఇంద్రజాలమో, గారడీ విద్యయో అయి ఉంటుంది. ఈ సభ అయిపోగానే ఆ మచ్చ తిరిగి వస్తుందని భ్రమిస్తారు కాని ఆ మచ్చ శాశ్వతంగానే పోయింది.

ఇంద్రియదృష్టి ఉన్నవాడికి శ్రీకృష్ణతత్వం ఎలా తెలుస్తుంది? మనస్సు ఇంద్రియదృష్టి, దేహదృష్టి కలిగి ఉంటే స్త్రీని చూడగానే నీచభావం కలుగుతుంది. కాని వాడి మనస్సు పవిత్రత పొందగానే దేహ దృష్టి పోతుంది, నీచభావం తొలగిపోతుంది. అదే దివ్యదృష్టి. అట్టి దివ్యదృష్టి వలన శాంతి లభిస్తుంది. అది లేనివాడికి శాంతి ఎక్కడిది? రామదాసు, కబీర్ సంసారులు కారా? మరి వారికి ఇంద్రియదృష్టి ఉందంటారా, లేదంటారా?" అని శ్రీ బాబు ప్రశ్నించారు.

"వారికి దారాపుత్రాదుల వ్యామోహం ఉందా? ఎంతవరకు ఉండాలో అంత వరకే ఉంటుంది. అలాగని గృహస్థు తన స్వధర్మాన్ని అశ్రద్ధ చేయరాదు. స్వధర్మాన్ని ఆచరిస్తూ గృహస్థాశ్రమంపై ఏ విధమైన వ్యామోహం లేకుండా వుండాలి. అది నిజమైన రాజయోగం. మనస్సు అనేక వాసనలతో కూడి ఉంటుంది. ఆ వాసనలను ఒక గురుకటాక్షం, లేక గురుకృప మాత్రమే తొలగించగలుగుతుంది. కాని అది వేరే విధంగా సాధ్యపడదు. ఇంగువ తాకిన చేయిని ఎంత కడిగితే మాత్రం ఆ వాసన పోతుందా అలాగే సాంబారు తిన్న చెయ్యి అదే వాసన కలిగి ఉంటుంది కదా! గురుమూర్తి యొక్క ప్రేమ మాతృప్రేమని సైతం మరిపిస్తుంది. వివేకానందుడు తన శిష్యులందరిని చేరదీసి దగ్గర కూర్చోపెట్టుకుని ఎంతో ప్రేమతో స్వయంగా వడ్డనచేస్తూ, భోజనం తినిపిస్తూ బోధ చేసేవాడు. వివేకానందుడు తాను తరించి తనను ఆశ్రయించిన శిష్యులందరికీ బోధామృతాన్ని అందజేసి ఎంతోమందిని తరింపజేస్తాడు. అలా ఉంటుంది గురుకృప అంటే.

శ్రీరామకృష్ణ పరమహంస స్థితి వేరు. ఆయన కారణజన్ముడు. ఆయన తనను ఆశ్రయించిన భక్తుల కర్మను కూడా స్వీకరించి తాను అనుభవించాడు. ఇలాంటి మహాత్ములు ఎంతోమంది ఉన్నారు. వారు కారణజన్ములు. అటువంటి వారిని ఆశ్రయించిన శిష్యులకు లోటు ఏముంది?" అన్నారు శ్రీబాబు.

ఇంతలో డాక్టరు కృష్ణార్జునరావుగారికి వారి ఇంట్లో Function గురించి శ్రీబాబూజీ గుర్తుజేశారు. శ్రీబాబూజీ మాట్లాడుతూ "మీ ఇంట్లో Function ఎప్పుడండీ డాక్టరు గారూ? సోమవారం కదూ?" అని అన్నారు. డాక్టరుగారు మాట్లాడుతూ 'సోమవారం కాదండీ. ఆదివారం బాబు!' అని అన్నారు. శ్రీబాబూజీ మాట్లాడుతూ

"చూశారా నాకు బుర్ర సరిగ్గా పని చేయటం లేదు" అన్నారు. డా॥ కృష్ణార్జునరావుగారు విషయాన్ని గ్రహించి, 'నాదే తప్పు బాబు. ఇందాక ఎవరో నన్ను మాయింట్లో Function గురించి అడిగినప్పుడు నేను వారికి సోమవారం అని పొరపాటు చెప్పాను. నా తప్పు సరిదిద్దటానికే మీరు నాకు గుర్తు జేశారు' అన్నారు శ్రీ బాబూజీతో. ఇంతలో డా॥ రాజు తిరిగి వచ్చాడు. శ్రీబాబూజీ మాట్లాడుతూ "ఇప్పడు నీకు ఎంత శాంతిగా వుంటుందో? స్వధర్మాన్ని చక్కగా నిర్వహించావు. స్వామి దర్శనానికి వచ్చావు. కానీ నీ దృష్టి అలా ఉండదుగా, పాపం నీ మనస్సు బాధ పడుతుంది. అజ్ఞానంతో ఉన్నవారికి మనస్సులో బాధ ఉంటుంది కదా! అది నిజమే. దానిని నేనూ అంగీకరిస్తాను. కాని ఎంతకాలం అజ్ఞానంతో ఉంటావు. జ్ఞానాన్ని ఎప్పడు సంపాదిస్తావు?" అని ప్రశ్నించారు.

శ్రీ బాబూజీ ఇంకా మాట్లాడుతూ "ఇటువంటి సంఘటనలు మీ మనస్సుని ప్రక్షాళన చేయటం కోసమేగాని మిమ్మల్ని బాధపెట్టాలనే దృష్టి వుండదు. అది గ్రహించండి చాలు" అన్నారు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీమతి దాసరి కుమారిగారు 4-1-2025 శనివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 70 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***ఫిబ్రవరి 2025 :*** AS 8519, 9208, 9278, PK 0070, 0071, 0073, 0075, 0079

***మార్చి 2025 :*** AS 7685, 7687, 8523, 8527, 8528, 8529, 8530, 8533, 8534, 9279, PK 0078, 0080, 0081, 0082, 0083, 0084, 0086, 0088, 0091, 0093

# అమ్మ మాట

- జపమాలా ప్రసాద

## ఆత్మ 'సెక్షన్'లో 'ఆటంబాంబు'లా ఉండాలి

"ధీ" అంటే "బుద్ధి", ఎక్కడ నిలబడుతుందో అదే 'సమాధి'. దానినే స్వామి, 'ధీ – బుద్ధి – సమాధి' అని చెప్తూ వుండేవారు. బుద్ధి భగవంతుని యందు నిలబడితేనే ఆ సమాధి దొరుకుతుంది. అనిత్యమైన వస్తువులయందు అది దొరకదు. "ప్రభూ! ఏ సేవ నిస్తావో నీ దయ. నీకేది యిష్టమో, ఆ సేవ నాకు దయచేయి. నీ దగ్గరకి చేరాను, నాకిది కావాలి, అది కావాలని లేదు" అని వినయ విధేయతలతో ప్రార్థిస్తే, ఆయన యిస్తారు. మామూలు భార్యాభర్తలిద్దరి మనస్సులు కలిస్తేనే ఆనందం కదా! మరి జీవాత్మ, పరమాత్మలో ఐక్యం అయితే వచ్చే ఆనందం ఎట్లా వుంటుంది? అది బ్రహ్మానందం! అది శాశ్వతమైన ఆనందం! అది ఎన్నటికీ మారనటువంటి ఆనందం. 'పర', 'జీవ' కూడా, 'ఆత్మ' వల్లనే ప్రకాశిస్తున్నాయి. 'పర', 'జీవ' తీసివేస్తే, వుండేది 'ఆత్మ' ఒకటే.



పరమాత్మ ఆనందస్వరూపుడు. ఆ ఆనందం మనం పొందితేనే యీ మానవజన్మకి సార్థకత. అది మనం పొందాలంటే మన మనసులోని విషబీజాలన్నింటినీ ఏరి పారేయాలి. ఒకవేళ మనసులో ఎంత నీచాతి నీచమైన సంకల్పం వచ్చినా, భయపడకుండా గురుమూర్తితో చెప్పేయాలి. ఇక మళ్ళీ దానిని గురించి ఆలోచించకూడదు. కానీ ఏనాడూ కూడా గురుమూర్తితో చెప్పకుండా మట్టుకు దాచకూడదు. నాగార్జునసాగర్ డామ్‌కయినా, వెంట్రుకవాసంత బీట పడితే చాలు, ఆ డామంతా కూలిపోవడానికి! ఇవాళ యీ చిన్న సంకల్పాన్ని గురుమూర్తికి చెప్పకుండా దాచమంటుంది మీ మనసు. రేపు మరొకటి..... అలా మాయ పూర్తిగా ఆవరించేస్తుంది. చివరికి పతనమయిపోతారు. ఏనాడూ కూడా గురుమూర్తి దగ్గర మనస్సు దాచకూడదు.

శ్రీ స్వామివారు ఎంతో ప్రేమతో మనకి తత్వబోధ చేసేవారు. "కూర్చుని ధ్యానం చేసుకోలేకపోతే కనీసం, కాఫీ త్రాగుతూనైనా భగవంతుడిని తలుచుకోండి" అని చెప్పేవారు. "బాబు తత్వానికి, వాక్కుకి అంతులేదు. మనం ఎంత మననం చేసుకుంటే అంత జుర్రుకోవచ్చు. భగవన్నామమనే ఉసిరికాయని నాలుక మీద వుంచుకుంటే, భవరోగాలని హరింప చేస్తుందది.

భక్తుల త్రోవలో మనం కూడా నడచుకోవాలి. వారి జీవితంలో ఎలా ప్రవర్తించారో, ఎలా ప్రకాశించారో తెలుసుకుని, మన జీవితాలని కూడా అలా చక్కదిద్దుకోవాలి.

ఆత్మ 'సెక్షన్'లో (ఆధ్యాత్మిక జీవితంలో) Atom Bomb (ఆటమ్ బాంబు) లాగానే వుండాలి! "నా స్వామి నాకున్నారు. నా చేత సాధన చేయించుకుంటారు! నాకేమీ భయం లేదు. ఎవరేమన్నా, నేనేమీ తప్పు చేయలేదు కనుక, బాబు నన్ను రక్షించుకుంటారు" అని ధీమాగా వున్నపుడు, ఆయన రక్షించరా? కుంతీదేవి ఎల్లప్పుడూ తనకి కష్టాలే రావాలని కోరుకుంది. ఎందుకంటే, కష్టాలు వస్తే భగవంతుడిని తప్పకుండా తలుచుకుంటాము కదా!

"ఇది జరగాలి, ఇది కావాలి" అనే కోరిక వుంచుకోకండి. అంతా స్వామి దయ. ఆయనకి తెలుసు, ఏ టైముకి, ఏదివ్వాలో - ఆ విశ్వాసం మట్టుకు సడలనీయకండి. విశ్వాసం సడలితే మట్టుకు, జరగదు. విశ్వాసం సడలితే సంకల్పాలు చోటుచేసుకుంటాయి. మాయ ప్రవేశిస్తుంది. కొబ్బరికాయ పెరిగే కొలదీ, నీరు హరించి పోయినట్టుగా, మీలో భగవంతుని యందు (గురుదేవుని యందు) విశ్వాసం పెరిగే కొలదీ, 'చలించే మనస్సు' అనే నీరు యిగిరిపోయి, 'జ్ఞానపుష్పం' వికసిస్తుంది. కనుక విశ్వాసాన్ని ఆరూఢం చేసుకోవాలి. 'నిద్రపోతున్నా కూడా రక్షించేవాడెవరు?' అది గుర్తుంచుకోవాలి. ఈ ప్రపంచంలో యెవ్వరూ కూడా జననమరణ విషవలయం నుండి రక్షించలేరు ఒక్క గురుదేవుడు తప్ప. మనస్సు, ఈ చింతలనుండి రాహిత్యం పొందడమే మృత్యువు అంతు తెలుసుకోవడం కనుక మీ మనస్సులోని చింతలని పారద్రోలి, నిరంతరం 'భగవచ్చింతన' చేయండి. అప్పుడు చింతలు లేని చిన్మయానందం మీ సొత్తు అవుతుంది.

**విజ్ఞప్తి**

***భక్త మహాశయులందరికీ విజ్ఞప్తి! మీకుగాని, మీ కుటుంబ సభ్యులకుగాని, మీ స్నేహితులకుగాని, లేదా మీకు తెలిసిన వారికిగాని శ్రీబాబూజీవారితో కలిగిన అనుభవాలను వ్రాసి పంపించవలసినదిగా ప్రార్థిస్తున్నాము. ఈ వ్యాసములు త్వరలో ఏర్పాటుకానున్న భీమవరం శాఖ ప్రత్యేక సంచిక (సావనీర్)లో గాని, సమర్థ సద్గురు మాసపత్రికలోగాని ప్రచురింపబడును.***

- సంపాదకుడు

# నిష్కామ కర్మ ఫలం

(గత సంచిక తరువాయి)

- రావి శోభ

అలా చెప్పగానే, ఆ కిరాతకుడు ఆ రూపాన్ని తన మనస్సు నిండా నింపుకుని, దృఢమైన విశ్వాసంతో, అక్కడి నుండి వెదకటానికి బయలుదేరాడు. ఆ కిరాతకుడు దారిపొడుగునా సింహం తల, మానవ శరీరం అని అనుకుంటూ కళ్ళనిండా ఆ రూపాన్ని నింపుకుని, మనస్సులో ఆ రూపాన్నే ధ్యానిస్తూ, తిండి తిప్పలు లేకుండా, అసలు ఆ ధ్యాసే లేకుండా సాయంత్రం దాకా అలాగే తిరిగాడు. సూరీడు కొండల చాటుకి వెళ్ళడానికి ఇహ కొంత సమయము మాత్రమే వున్నదనగా ఆ కిరాతకుడు వెతికి వెతికి అలసిపోయి, అక్కడే చెట్లకి వున్న తాళ్ళతో ప్రాణ త్యాగం చేయబోతూ, 'ఆ సాములవారికి ఈ అడవి అంతా నాకు బాగా తెలుసు అని గొప్పలు పలికాను, కానీ, ఎంతవెతికినా నాకు ఆ రూపం కనబడలేదు. ఆ సాములవారి దగ్గరకి నేను వెళ్ళలేను. కాబట్టి ఈ తాళ్ళతో ఇక్కడే ప్రాణత్యాగం చేస్తాను' అని, అక్కడ వున్న చెట్టు తాళ్ళని తన చేతిలోకి తీసుకోబోతుండగా ఆ చెట్టు ప్రక్కనే నిలబడి వున్న ఆ అద్భుతమైన రూపాన్ని చూశాడా కిరాతకుడు!

సాములవారు తనకు చెప్పిన ఆనవాలు గుర్తు చేసుకుంటూ, సింహం తలతో, మానవ శరీరంతో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న ఆ రూపాన్ని చూసి, సంబరంగా 'ఆ చిక్కావులే ఇప్పటికి' అని తన చేతిలో వున్న ఆ చెట్ల తాళ్ళతో ఆయన్ని కట్టేసి, ఆయనతో ఇప్పటిదాకా నీ కోసమే వెతికాను అని ఆ సాములవారు వున్న బండరాతి దగ్గరకు తీసుకువెళ్ళాడు. అక్కడే కళ్ళుమూసుకుని వున్న ఆ సామి దగ్గరగా వెళ్ళి, 'ఇదిగోండి సామీ! మీరు అడిగిన రూపం వున్న ఆయనను తీసుకువచ్చాను' అనేసరికి వెంటనే సనందుడు కళ్ళు తెరచిచూడగా, కిరాతకుడు సనందుడితో 'సాములూ! ఇదిగోనండీ మీరడిగిన రూపం వున్న ఆయన్ని తప్పించు కోకుండా వుండాలని తాళ్ళతో కట్టేసి మరీ తెచ్చాను తీసుకోండి' అంటూ ఆ తాళ్ళను ఆయన చేతిలో పెట్టాడు.

ఆ మాటలు విని సనందుడు ఆశ్చర్యపోతూ 'ఎక్కడా? నాకు ఆ స్వామి నాకేమీ కనబడటం లేదే? వట్టి తాడు మాత్రమే  నా చేతికి అందిస్తున్నావు' అన్నాడు. ఆయన అలా అంటుంటే అయోమయంగా కిరాతకుడు తన ప్రక్కనే వున్న ఆ నరసింహస్వామినే చూస్తూ అమాయకంగా 'సాములూ! నా పక్కనే వున్నాడు కదా మీరు చెప్పిన ఆ సింహంతల, మానవ శరీరం వున్న ఆయన పచ్చని పట్టుపంచ కూడా కట్టుకున్నాడు. గుండెల మీద తెల్లగా గీతలు కూడా వున్నాయి. నేను తాడుతో కట్టి మరీ తీసుకువచ్చాను.

అయినా కూడా ఆయన నన్నేమీ అనలేదు. మీరేమో మీకెవరూ కనిపించడం లేదు అంటున్నారు. నా పక్కనే వున్నా నాకు కనిపిస్తూ మీకు మాత్రం ఎందుకు కనబడటం లేదో నేను ఆయననే అడిగి తెలుసుకుంటాను' అని అంటుండగానే, వారిద్దరికీ ఒక అశరీరవాణి ఇలా వినిపించింది. 'ఓ కిరాతకా! సనందుడికి సాయపడాలనే మంచి వుద్దేశ్యంతో కనీసం ఏ ప్రతిఫలాన్ని కూడా ఆశించకుండా, నమ్మకంతో, త్రికరణ శుద్ధితో నన్ను ఆరాధించావు కాబట్టి నీకు మోక్షాన్ని ప్రసాదిస్తున్నాను. అలాగే సనందా నీకు అవసరమైనప్పుడు నన్ను తలచుకో అప్పుడు నీకు కనిపించి రక్షిస్తాను' అని పలికింది ఆ దివ్యవాణి.

కాలక్రమేణా సనందుడు శ్రీ శంకరాచార్యుల వారి శిష్యుడై ఆయనను సేవించసాగాడు. ఒకనాడు శంకరులు సనందుడిని పరీక్షించదలచి నది ఈవలి ఒడ్డున ఉండి 'సనందా!' అని పిలుస్తారు. అప్పుడు ఆవలి ఒడ్డున వున్న సనందుడు ఆ గురుదేవుల పిలుపు విని మనస్సులో గురు నామమంత్రాన్ని జపిస్తూ నది మీద నడుచుకుంటూ శంకరుల వద్దకు వస్తాడు. మిగతా శిష్యులు ఆ నదిని ఎలా దాటాలా అని చూస్తుండగా, సనందుడు నదిని దాటిన దారి ఇదే అని తెలిపే విధంగా ఆ నదిలో పద్మాలు అన్నీ వరుసగా వున్నాయి. అప్పటి నుండి ఆయన పద్మపాదుడుగా పేరుపొందాడు.

ఇలా ఉండగా ఒకనాటి రాత్రి అందరూ పడుకుని వుండగా ఒక తాంత్రికుడు శ్రీ శంకరుల దగ్గరకు వెడతాడు. అది గమనించిన పద్మపాదుడు ఆ తాంత్రికుడిని అనుసరిస్తాడు. ఆ తాంత్రికుడు శంకరులను ఊరి ఆవల వున్న కాళికాదేవి ఆలయంలోకి తీసుకువెళ్ళి అక్కడ ఆయనను బలి ఇవ్వబోగా, ఇదంతా గమనిస్తున్న పద్మపాదుడు వెంటనే శ్రీ నృసింహ స్తోత్రాన్ని పఠిస్తారు. అప్పుడు నరసింహస్వామి వచ్చి ఆ తాంత్రికుడిని వధిస్తారు. ఆ విధంగా పద్మపాదుడు తన గురువును రక్షించుకుంటాడు.

పద్మపాదుడు శంకరులతో 'గురుదేవా! నా చిన్ననాడు చేసిన శ్రీ నృసింహ వుపాసనకు ఈరోజు ఇలా అనుగ్రహించారు' అని చెబుతాడు.

శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దర్శనం వలన ఋణవిమోచనము అంటే జన్మరాహిత్యము, అంటే మోక్షము, ఆయన దివ్యమంగళ విగ్రహ దర్శనం అనే ఐశ్వర్యం కలుగుతాయి. త్రికరణ శుద్ధిగా చేసే నిష్కామ కర్మకి దైవం ఎప్పుడూ సహాయంగా వుంటాడు!

# భీమవరం

- పాలూరి కాళీప్రసాద్

భీమ అంటే భయంకరమైన అనే అర్థమే కాకుండా ఈ జగత్తుకంతటికీ జననీ జనకులైన పార్వతీ పరమేశ్వరులిద్దరికీ భీమ నామధేయం వర్తిస్తుంది. ఆ పరమేశ్వరుడే భీమవరంలో శ్రీ భీమేశ్వర స్వామి, శ్రీ సోమేశ్వర స్వామివార్లుగా వెలసి భక్తులను అనుగ్రహిస్తున్నారు. అలా పంచారామ క్షేత్రాలలో ఒకటిగా వెలుగొందుతున్న భీమవరంలో జగన్మాత శ్రీ మావుళ్ళమ్మగా వెలసి పూజలందుకుంటోంది. మనస్సుకు అధిపతియైన చంద్రునిచే ప్రతిష్ఠింపబడిన శ్రీ సోమేశ్వర స్వామి పౌర్ణమినాడు నిండు వెన్నెలలు కురుస్తూ ధవళవర్ణంలో ప్రకాశిస్తూ, ఒక్కొక్క రోజు గడుస్తున్నకొద్దీ మెల్లగా కాంతి తగ్గించుకొని అమావాస్యనాటికి నల్లగా మారిపోతారు. మళ్ళీ ఒక్కొక్కరోజూ కాంతిని పెంచుకొంటూ పౌర్ణమి నాటికి పూర్తి తెల్లదనాన్ని సంతరించుకుంటారు. ఇలా భగవద్గీతలో స్వామి చెప్పిన శుక్ల కృష్ణ గతులను కళ్ళకు కట్టినట్లుగా చూపిస్తూ పునరావృత్తి రహిత స్థితిని పొందాలంటే శుక్లమార్గమైన ఆధ్యాత్మిక పథంలో ప్రయాణించాలని మనకు సూచిస్తూ ఉంటారు.

అలాగే మావుళ్ళమ్మ తల్లి సన్నిధిలో సాధన చేసి శ్రీ చల్లా కృష్ణమూర్తి గారు, శ్రీ తనికెళ్ళ చలపతిరావు గారు వంటి సాధకులు ఎన్నెన్నో దివ్యానుభూతులను పొందారు. తనను పొందాలని ఎన్నో కోట్ల సంవత్సరాలనుండి ఎందరో సాధకులు తలక్రిందులుగా తపస్సులు చేస్తుంటే 'నేనూ మీలో ఒకడినేరా!' అన్నట్లుగా ఆ జగత్పిత భీమవరం సమీపంలోని యనమదుర్రు గ్రామంలో శీర్షాసనంలో పద్మాసనం వేసుకొని వెలిశారు. ఆయనకు తోడుగా లోకాలనేలే జగన్మాత పచ్చి బాలింతరాలుగా కుమారస్వామిని ఒడిలో ఉంచుకొని తన జ్ఞాన క్షీరాలను ప్రసాదిస్తూ వెలసింది. ఇటువంటి పవిత్ర భూమిలో వున్న ఎందరో సాధకులను, జిజ్ఞాసులను, ఆర్తులను ఉద్ధరించి భీమ భవార్ణవం (భయంకరమైన సంసార సాగరం) దాటించి తరింపజేయడానికి ఆ జగజ్జననీ జనకులిద్దరూ ఒకే రూపాన్ని ధరించి మానవాకృతిలో 'సమర్థ సద్గురు శ్రీ శ్రీ శ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహారాజ్'గా ఈ ప్రాంతంలో కొన్ని దశాబ్దాలపాటు సంచరించి ఈ ప్రాంతాన్ని పుణ్యక్షేత్రంగా మార్చారు.

సర్వాధిష్టాన చైతన్య స్వరూపులైన శ్రీగురుదేవులు ఎవరెవరి ఆధ్యాత్మిక స్థాయికి తగ్గట్లుగా వారికి మార్గాన్ని ఉపదేశించి వారి వారి సాధనలో తోడునీడగా ఉంటూ తరింపజేశారు. శ్రీ కందర్ప పరశురామయ్య గారు(యనమదుర్రు), శ్రీ లలితానంద సరస్వతీ స్వామిని వారు, శ్రీ కొప్పెర్ల వెంకటరాజు గారు(పెదనింద్రకొలను), శ్రీమతి యర్రాప్రగడ శేష(గిరి)మ్మగారు (భీమవరం తాతయ్యగారి పెద్ద కుమార్తె) వంటి సిద్ధ పురుషులతో తత్వ విచారణ చేసేవారు. శ్రీ వితాల కామయ్య శాస్త్రిగారు(కోరుకొల్లు), శ్రీ

చల్లా కృష్ణమూర్తి గారు, శ్రీ కలిదిండి నరసింహ రాజుగారు (దిరుసుమర్రు), శ్రీ తనికెళ్ళ చలపతి రావుగారు వంటి సాధకులకు వారు స్మరించినప్పుడల్లా దర్శనమిచ్చి మార్గదర్శనం చేసేవారు. ఏ ఆధ్యాత్మిక గంధమూ లేని భీమవరం తాతయ్య (శ్రీ పాలూరి శ్రీరామమూర్తి)గారి వంటి వారిని నిరంతరం నవ్విస్తూ, చక్కిలిగింతలు పెడుతూనే పరమమైన బ్రహ్మానందాన్ని అనుభవంలోకి తెచ్చేవారు. ఏ మంత్రాలు రాని పాలూరి సీతమ్మగారికి 'పాటల పూజ'తోనే దివ్యానుభవాలను ఎన్నెన్నో ప్రసాదించారు.

తమను అవమానించాలని చూసిన ఎందరో ధూర్తులకు కళ్ళు తెరిపించి సన్మార్గంలో పెట్టారు. చివరికి ఈ ఊరిలోని రిక్షావారితో కూడా పావలా నుండి పదిపైసల వరకు బేరాలాడుతూ, ఆ వంకతో వారితో ఎంతో దూరం కలిసి నడుస్తూ, భగవత్సన్నిధిలో కలిగే ఆనందాన్ని వారికి తెలియకుండానే వారితో అనుభవింపజేశారు. నిత్యం తమ దర్శనార్థమై వచ్చే ఎందరో భక్తుల రకరకాల సంసార విషయిక ఆర్తులను తీర్చి వారికి ఉపశాంతి, మార్గదర్శనం చేశారు. బృందావనంలో శ్రీకృష్ణుడు చూపించిన దివ్య లీలలన్నీ ఇక్కడ చూపించారు. ఇలా భీమవరం ప్రాంతంలోని ఎందరో భక్తుల ఎన్నెన్నో జన్మలనుండి కించిత్ కించిత్‌గా పోగుపడి రాశీభూతమైన పుణ్యఫలాన్ని ఈ జన్మలో అనుభవంలోనికి తీసుకొని రావడానికై తమకు తాముగా ఆ పరబ్రహ్మమే ఆకారం దాల్చి తరలివచ్చిన గొప్ప వరం శ్రీగురుదేవులు.

అట్టి దయామయులైన శ్రీగురుదేవులు గుంటూరు జిల్లా నంబూరు సమీపంలో శ్రీ కాళీ వనాశ్రమాన్ని స్థాపించిన తరువాత కూడా ఈ భీమవరం ప్రాంతం పైనున్న వారి దివ్య వాత్సల్యాన్ని ప్రకటిస్తూ తమకు తాముగా శ్రీ భీమవరం తాతయ్యగారి కుటుంబం నుండి ఉండి రోడ్డులోని కొంత స్థలాన్ని అడిగి తీసుకొని అక్కడ మరొక ఆశ్రమాన్ని స్థాపించాలని సంకల్పించారు. సత్య సంకల్పులైన శ్రీవారి దివ్య సంకల్పం ఇన్నాళ్ళకు ఫలించి భవ్యమైన బృందావనంగా శ్రీగురుదేవుల దివ్యమంగళ మూర్తితో, అలాగే శ్రీకాళీ వనాశ్రమంలో వెలసిన ఇతర దేవతల ఉపాలయాలతో, అన్నదాన, వసతి భవనాలతో సర్వాంగ సుందరంగా రూపు దిద్దుకుంటోంది.

2025 మార్చి 12వ తేదీన ఆశ్రమ ప్రవేశము, అనంతరం హోమాలు, అధివాసాలు, సామూహిక పూజలు, పారాయణలు, సత్సంగాలతో కార్యక్రమాలు జరుపుకుంటూ 17వ తేదీన శ్రీగురుదేవుల, ఇతర దేవతామూర్తుల ప్రతిష్ఠా మహోత్సవం జరుపుకుంటున్నాం. ఈ కార్యక్రమానికి ఆస్తిక మహాశయులందరూ విచ్చేసి, పాల్గొని, ఆ మహదానందంలో భాగస్వాములై తరించాలని, భీమవరానికి లభించిన ఇట్టి మహత్తర వరాన్ని సద్వినియోగ పరచుకోవాలని అందరికీ ఇదే ఆహ్వానం!

# శ్రీ మాతాజీ వారి నూతన సంవత్సర ఆశీస్సులు

- రమణ ప్రసాద్

శ్రీగురుదేవుల అనుగ్రహంతో మనం 2024వ సంవత్సరానికి వీడ్కోలు చెప్పి 2025లో ప్రవేశించాం. మనం క్యాలెండరు అంకెలకి బాగా అలవాటు పడిపోయాం. తిథుల ప్రకారంగా చూస్తే అవి ఒక క్రమంగా మారవు. నిన్నటి తిథి ఈ రోజు ఉదయం ఏ 9గంల.30నిలకో మారిపోయింది. కాని ఇంగ్లీషు క్యాలెండరు ప్రకారం రాత్రి 12 గం.లకి ఇండియాలో డేటు మారుతుంది. ఇండియాలో టైమ్ మారదు. కాని అమెరికాలో ఐదు చోట్ల టైమ్ మారుతుంది. భగవంతుడు సృష్టిలో సూర్యుని గతి బట్టి నక్షత్ర గ్రహాల గమనాన్ని అనుసరించి కాలాన్ని నిర్ణయించాడు. ఆ విధంగా మనకి అధికమాసం వస్తుంది.

2025 కూడితే 9 వస్తుంది. 9కి చాలా విశిష్ఠ స్థానం ఉంది. 9 అంటే "నవ" అంటే నూతనత్వం. అలాగే మనకి నవ గ్రహాలు, నవ విధ భక్తులు, అమ్మవారి నవావరణలు, శరీరానికి నవ రంధ్రాలు ఉన్నాయి. ఎప్పుడైతే శ్రీ గురు చరణాలయందు అభిన్నమైన భక్తి మనం సంపాదించుకొంటామో అప్పుడు మనలను ఏ దుష్ట గ్రహాలు బాధించవు. బృహస్పతి గురుగ్రహం లక్ష దోషాలని హరిస్తుందని అంటారు. ఆ బృహస్పతికి కూడా శక్తి నిచ్చేది శ్రీ గురు చరణారవిందములే. వ్యక్తంగా ఉన్నప్పుడు మనం గుర్తించలేక పోతున్నామని మనకోసం వారు దేహాన్ని విడిచారు. దేహంతో వున్నంత వరకు మనకి రెండు ఉంటాయి. జీవుడు – పరమాత్మ; ఆత్మ – పరమాత్మ అని, ఆ దివ్యచరణాలని ఆశ్రయించి ఎవరు దంద్వత్వాన్ని హరించుకొంటే, అక్కడ ప్రకాశించేది శ్రీ గురుదేవులే. పరమాత్మను చేరాలంటే శ్రీ గురుదేవులను ఆశ్రయించాలి. మనం చేసే పారాయణలు, భగవద్గీతా పఠనము మనని ఏకాగ్ర దృష్టికి తీసికొని వెళ్తాయి. నీలోకి నువ్వు వెళ్తే, నీ శరీరాన్ని, మనస్సును దాటి ఆత్మలో ఐక్యమవుతావు. అటువంటి స్థితిని జాగ్రదావస్థలో అనుభవించాలి. అది తప్ప ఇంకొక విధానం లేదు. "నాన్యః పంథాః యనాయ విద్యతే".

మనలను ఒక శక్తి, ఒక పవరు నడిపిస్తోంది. దానిని గుర్తింప చేయటానికి శ్రీ గురుదేవులు ఒక రూపం ధరించి వచ్చి, "నిన్ను నీవు గుర్తించు! నీ జీవితం సార్థకం చేసికో!" అని హెచ్చరిస్తున్నారు. అక్షర రూపుడు భగవంతుడు. క్షరం అంటే మార్పు చెందేది. చంద్రలోకానికి సైంటిస్టులు వెళ్తున్నారు. అక్కడనుండి మట్టి కూడా తెచ్చారు. అందులో మార్పు లేదు. అలాగే మానససరోవర్ దగ్గర కైలాస పర్వతానికి చాలామంది వెళ్ళారు. ఎవ్వరూ అధిరోహణం చేయలేకపోయారు. శ్రీ గురుదేవులు మనలను తమ

సన్నిధికి చేర్చుకొని మన హృదయాలనే మానససరోవరం చేశారు. సరోవరం అంటే కదిలేది. నీటికి, గాలికి కదలికలు ఉన్నాయి. ఆకాశంలో ప్రకాశించే పరమాత్మని మనలోకి మనం వెళ్ళి అర్చన చేస్తే మన హృదయంలో కైలాసనాధుని దర్శనం అవుతుంది. ఆ స్వామికి కాలంతో పని ఏముంది? మనకి కూడా కాలంతో పని ఏముంది? భగవంతుడు మనలను సృష్టించాడు, మనలని నడిపిస్తున్నాడు. ఆయనే తీసుకుపోతాడు.

వ్యవహారం కోసం మనం 2025లో ఉన్నామని చెప్పుకుంటున్నాము. అప్పుడే ఒక పూట గడిచి పోయింది. కాలగతిలో 2026 కూడా వస్తుంది. ఉత్కృష్టమైన మానవ జన్మ వచ్చినందుకు, శ్రీ గురుదేవుల సన్నిధిలో స్థానం లభించినందుకు ఆ కాలజ్ఞాన విదగ్రణిని ధ్యానించాలి. ఆయన మనకు జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. ఆ ప్రభువు చరణాలు మనకు భిన్నంగాలేవు. నీలో ఉన్న పరమాత్మను మానసికంగా పూజించాలి. అదే ఆత్మారాధన అంటే. శ్రీ దండి స్వామి వారు మూడు రోజుల కార్యక్రమం పెట్టి ఆత్మారాధన చేసికొన్నారు. ఇది మనకి మనం చేసికొనే పూజ. అది మనకి తృప్తిని ఇస్తోంది. నీలో ఆవేదన ఉండాలి. నీకు ఆకలి వేస్తే ఇంకొకరు తింటే నీ ఆకలి తీరుతుందా? "ఆత్మావై పుత్ర నామాసి" – కొడుకు తండ్రి అంతటి వాడు. నిన్ను పున్నామ నరకం నుండి రక్షిస్తాడు అంటారు.

ఆత్మానుభవం పొందాలంటే తనలోకి తాను వెళ్ళి, తన ప్రభువుకి సర్వ సమర్పణ చేసికోవాలి. ఇదంతా వారి ప్రకాశమే అని దృఢ నిశ్చయానికి రావాలి. తదనుభూతిని పొందాలి. అక్కడ ప్రకాశించేది నీవే. వ్యవహారానికి అనంతం అంటాం. అక్కడ ఇంకెవ్వరూ చెప్పనక్కర లేదు నువ్వు తరించావని. కాళీప్రసాద దేవుని ఆశ్రయించిన వారికి కాలంతో పని ఏముంది? తమ అనంత స్వరూపాన్ని గుర్తింప చేయటానికే వారు తమ అవతారం చాలించారు. వారు మనతోనే వున్నారు. మనమై ఉన్నారు. మనం నిరంతరం ఆ అనుభూతిలో ఉంటే వారి అనుగ్రహం మనకి తప్పక కలుగుతుంది. అటువంటి గురుదేవులు మనకి లభించారు. శ్రీ గురుదేవుల నిర్భయత్వాన్ని మనం పొందినప్పుడు, ఎక్కడ ఉన్నా వారి అనుగ్రహానికి పాత్రుల మవుతాం. 'నమ్మిన వాడికి బంగారు పిచ్చుక, నమ్మని వాడికి బూడిదే" అన్నారు శ్రీ గురుదేవులు.

గోపికలు శ్రీ కృష్ణుడిని పతిగా పొందటానికి కాత్యాయనీ వ్రతం చేశారు. శ్రీకృష్ణుడు గోపికలని, "రండి! రండి!" నా కోసమేగా మీ పూజలు" అని వారిని అనుగ్రహించాడు. వారు ఏ పూజలు చేయకుండానే స్వామి అనుగ్రహాన్ని పొందారు.

ఉన్నది ఒక్కటే అన్న విషయాన్ని గ్రహించాలి, ఆశ్రయించాలి, అనుభవించాలి.

అటువంటి శ్రీకృష్ణ రూపులైన మన గురుదేవులు ఆనందోత్సాహాలతో గడపమని 2025ని మనకి ప్రసాదించారు. 24 తత్త్వాలు దాటితే ఉన్నదే 25వ తత్త్వమే పూర్ణత్వం. శ్రీ గురుదేవులు మనని విచారణ చేయమన్నారు. విచారణ ఆధ్యాత్మికంగా ఉండాలి. ప్రాపంచికంగా ఉంటే మిగిలేది విచారమే. శ్రీ గురుదేవులు మనందరికీ అటువంటి సద్విచారణ, ఆయురారోగ్యములు, నిరంతర భగవన్నామ స్మరణను, ఆత్మానందాన్ని ప్రసాదించి సర్వదా గురుపాదుకలు కాపాడుగాక! సుఖీభవ! సుఖీభవ!!



**అనుభవింపజేసితివి నీ నామ రుచిని**
**అనితరసాధ్యమైన నీ పదముల సేవ**
**అద్వితీయమైన అపరోక్షానుభూతిననుదినము**
**అనుభవైకవేద్యమైనదిదియే కదా! అంతర్యామీ!**

- భాగవతుల హనుమత్ జయప్రద

# హనుమత్తత్త్వం

(గత సంచిక తరువాయి)

- ప్రసాదవర్మ కామఋషి

జన్మ వృత్తాంతము: దేవ లోకంలో పుంజికస్థల అనే అప్సరస ఉండేది. ఆమె మహా సౌందర్యవతి. శాపవశాన ఆమె భూలోకంలో అంజనిగా జన్మించింది. మహా పరాక్రమ వంతుడైన కేసరి అనే వానర శ్రేష్ఠుడు ఆమెను వివాహం చేసుకున్నాడు. శాపగ్రస్త అయినా ఆమెకు కామరూప శక్తి కొనసాగుతూ ఉంది. ఆమె అపురూప సౌందర్యానికి ఈ శక్తి కూడా కారణమయ్యింది. ఒకనాడు ధగద్ధగాయమానమైన వస్త్ర, ఆభరణాలు ధరించి ఒక పర్వత శిఖరం మీద చల్ల గాలిలో విహారం చేస్తున్నది. గాలికి ఆమె కట్టుకున్న చీర అస్తవ్యస్తమై ఆమె అందాలు బహిర్గతమయ్యాయి. ఆమె అందాన్ని చూసిన వాయువు మోహితుడై నిగ్రహాన్ని కోల్పోయి గాఢంగా కౌగలించుకున్నాడు. కొంతసేపటికి జరుగుతున్నదేమిటో గ్రహించి బిగ్గరగా కేక పెట్టింది. వాయుదేవుడు ఆమె ముందుకు వచ్చి "అంజనా! భయపడకు నా వలన నీకు తేజస్వంతుడు, మహా శక్తిమంతుడూ అయిన పుత్రుడు జన్మిస్తాడు" అని చెప్పి అదృశ్యమయ్యాడు. ఆమె అక్కడ ఒక గుహలో నివాసముంటూ, కాలక్రమాన ఒక కొడుకుని కన్నది. అతడే హనుమంతుడు. అంజన పుత్రుడు కనుక ఆంజనేయుడైనాడు. హనుమ వాయువు వలన జన్మించి వాయునందనుడైనాడు. శబ్దము కూడా వాయువు వలననే పుట్టి వ్యక్తమవుతుంది. అందుకేనేమో వస్య వాక్కు, శబ్ద ప్రభుతలో అసాధారణ స్థాయి ఈయనది. హనువు అనగా దౌడ, సూర్యుని నుండి క్రింద పడినపుడు దౌడలు సొట్ట పడి, హనుమంతుడని పేరు వచ్చింది.

ముక్కోటి దేవతలందరూ ఆంజనేయస్వామిలో ఉన్నారు. ఏకాదశ రుద్రావతారుడనీ బ్రహ్మావిష్ణుశివాంశ సంభూతుడని, వర్ణింపబడినాడు. హనుమ మంత్ర స్వరూపుడు, అనగా శబ్ద స్వరూపుడు. భగవంతుని తెలియచేయు శబ్దమే మంత్రము. జీవులను ఉద్ధరించుటకు తగిన మంత్రోపదేశము ప్రసాదింపగల ఆచార్యోత్తముడు హనుమ.

ఇట్టి మహనీయుని ఎడల భక్తిప్రపత్తులతో, నిరంతర స్మరణతో తాదాత్మ్యం చెంది త్వమేవాహం అన్న స్థితికి చెందిన పరమ భాగవతులెందరో ఉన్నారు. ముందుగా మనకు స్ఫురణకు వచ్చేది హనుమాన్ చాలీసా రచించిన శ్రీ తులసీదాస్. అటులనే మన పూర్వపుణ్య విశేషము చేత మనకు సమకాలికులై మన మధ్య సంచరించి, తరింప చేసిన బాబూజీ వారు గుర్తుకు రాక మానరు. వారు హనుమంతులవారితో తాదాత్మ్యం చెందిన వుదంతం వారే వివరించారొక సందర్భంలో. ఎక్కడో తపస్సు చేసుకోవటానికి

వెళుతుండగా ఒక ముత్తైదువ తారస పడి ఒడిలోకి తీసుకుని "నేను అమ్మనురా, జగజ్జననిని. నీకు తోడుగా మారుతిని పంపుతున్నాను" అని చెప్పింది.

బాల్యం నుంచి శ్రీరామతారక మంత్రోపాసన చేసి శ్రీరామ దర్శనం పలుమార్లు పొందిన వీరికి హనుమద్దర్శనము, హనుమదాశీస్సులు, హనుమత్సహకారము సంపూర్ణముగా లభించుటలో ఆశ్చర్యమేమున్నది. శ్రీమదాంజనేయ స్వామి నన్ను వెన్నంటి ఉండి రక్షణ భారం వహించేవారు. ఇది నిజమా కలా అన్న సందేహం వచ్చినప్పుడల్లా వెంటనే హనుమద్దర్శనం అయ్యేదని, శ్రీహనుమాన్ అభయ ముద్రతో నిలిచి – ఇప్పుడు నీవు దర్శిస్తున్నది, పొందుతున్నది నీ స్వస్వరూపము యొక్క అపరోక్షానుభవమే అని చెప్పేవారట. ఇది మహా యోగులకు మాత్రమే సాధ్యమయ్యే అద్వైతానుభూతి.

శ్రీ కాళీమాత, శ్రీ హనుమాన్‌ల దివ్య మూర్తులున్న దేవతార్చన పేటికను ఒక మహర్షి ప్రసాదించాడు. అమ్మ "ఇది శివాజ్ఞతోనే నీకు ఇవ్వబడింది. భక్తిశ్రద్ధలతో పూజించు. నీకు, లోకానికి మేలుచేస్తుంది" అని చెప్పిందట. ఎల్లప్పుడూ ఈ పేటికను ఒక సంచిలో ఉంచుకునే దేశ పర్యటనలు చేస్తూ ఉండేవారు.

బ్రహ్మచర్యం, కార్యదీక్ష, వాక్చతురత, భక్తిప్రపత్తులు వంటి సుగుణాలెన్నో వున్నప్పటికీ ఏమీ తెలియనట్టు, ఏమీ పట్టనట్టు నిర్వికారంగా, నిర్లిప్తంగా సర్వం శ్రీరామార్పణం అన్నట్టు ప్రవర్తించే ఈ మహనీయుడు యోగ స్వరూపుడు. తదారాధన ఫలం అద్భుతంగా ఉంటుంది.

బుద్ధిర్యశో బలం ధైర్యం నిర్భయత్వ మరోగితా
అజాడ్యం వాక్పటుత్వం చ హనుమత్స్మ రణాద్భవేత్.

*భగవద్భక్తిని, ఆధ్యాత్మిక దృష్టిని అలవరచుకోవడం ద్వారా, ప్రబల శాంతి, స్నేహం, సౌమనస్య సామరస్యాలను పెంపొందించు కోవచ్చు.*

- శ్రీ కాళీబాబు

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

## ప్రథమోధ్యాయము - అర్జున విషాదయోగము

ఇటువంటి సందర్భాలలోనే నీవు చాలా జాగ్రత్తగా వ్యవహరించి శాస్త్రోపదిష్టమైన స్వధర్మాచరణంలో ముందుకు సాగిపోవాలి. ఇక్కడ అర్జునుడిలో ఆసక్తి పరాకృపగా, దయగా కనిపించింది. నీ జీవితంలో కూడా, ఇలాంటి సంఘటనలు ఎదురయ్యే ప్రమాదం ఎప్పుడూ ఉంది. ఈ ఆసక్తి మూలంగా అర్జునుడంతటి మహా యోధుడు యుద్ధభూమిలో, శత్రువులు పరిహసిస్తారేమో అని అయినా తలచక, విచారంతో ఏడుస్తూ, నేను యుద్ధం చేయను అని శరచాపములను వదిలి చతికిలబడ్డాడు అంటే ఇక నీ సంగతి ఏమిటో ఆలోచించి చూడు. ఈ ఆసక్తికి ఎంతటి శక్తి ఉన్నదో దీని ద్వారా తెలుసుకో.



అహంకార, మమకారాల ప్రకటనమే ఆసక్తి. ఈ ఆసక్తి అర్జునుడు, యుద్ధభూమికి వచ్చినప్పుడూ, అంతకు పూర్వమూ కూడా అతడిలో ఉన్నది. అంతకు ముందు అర్జునుడు ఉత్తరగోగ్రహణ సమయంలో కౌరవులతో యుద్ధం చేసినప్పుడు కాని, ఇప్పుడు కురు వీరులను అతడు స్వజనంగా భావించనంత వరకు గాని బయట పడలేదు. కాని ఇరు సేనలలో ఉన్నవారు అందరూ ఎప్పుడైతే అర్జునుడికి స్వజనంగా కనిపించటం జరిగిందో, అప్పుడు వెంటనే ఈ ఆసక్తి అతనిలో మేలుకొని, పరాకృప రూపంలో, ఒక్కసారిగా అతడిని ఆవహించింది.

నీకు కూడా ఆత్మానుభూతిని పొందాలి అన్న ఆకాంక్ష ఉన్నది. దానితో పాటుగా అహంకార, మమకార రూపమైన ఆసక్తి, అంటే, నాది లేదా 'స్వ' అనే భావం కూడ ఉన్నది. ఈ ఆసక్తి ఎప్పుడు ఏ రూపంలో బయటపడుతుంది అన్నది ఊహకు కూడా అందని విషయం. అంతెందుకు, అసలు అది బహిర్గతమైనప్పుడు కూడా, నీవు దానిని తెలుసుకోలేవు. అది నీకు మాతా పితరుల పట్ల నిర్వహించవలసిన

బాధ్యత రూపంలోనో, లేదా మరేదో విధ్యుక్త ధర్మ నిర్వహణ రూపంలోనో అడ్డంగా నిలబడుతుంది. అయినా నీవు మాత్రం ఆ సమయంలో, నీకు ఈ అవాంతరాలు, నీలోని సంసారాసక్తి మూలంగా కలుగుతున్నాయి అన్న సత్యాన్ని గ్రహించలేవు. ఈ ఆసక్తికి ఏదైనా అభ్యంతరం వచ్చినా, ఆఘాతం కలిగినా అది శోకంగా మారుతుంది. ఆసక్తి ఎంత బలమైనదో తెలుసుకోవాలి అంటే, దానికి ఆఘాతం కలిగినప్పుడు కలిగే నిరాశా నిస్పృహలను బట్టి, శోకం యొక్క తీవ్రతను బట్టి తెలుసుకోవలసిందే.

**28. కృపయా పరయా--విష్టో విషీదన్నిదమబ్రవీత్**

**అర్జున ఉవాచ:**

**దృష్ట్వేమం స్వజనం కృష్ణ! యుయుత్సుం సముపస్థితమ్ ॥**

**29. సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి**
**వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ॥**

**30. గాండీవం స్రంసతే హస్తాత్ త్వక్చైవ పరిదహ్యతే**
**న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః ॥**

ఈ ఆసక్తికి లోనైనప్పుడు అన్ని విలువలు తల్లక్రిందులై, తారుమారై కనిపిస్తాయి. అందువలననే, అర్జునుడు కొద్ది క్షణాల క్రితమే ఎవరిని శత్రువులుగా భావించి, వారితో యుద్ధం చేయటానికి రణభూమికి వచ్చాడో, వారిని గురించే ఇప్పుడు "శ్రీకృష్ణా! యుద్ధము చేయగోరి, ఇక్కడ చేరిన ఆత్మబంధువులను చూచి నా మనస్సు తల్లడిల్లిపోతున్నది. అవయవములు దుర్బలములై పట్టు తప్పిపోతునట్లున్నాయి. నోరు ఎండిపోతున్నది. శరీరము వణుకుతున్నది. రోమములు నిక్కబొడుచు కుంటున్నాయి. గాండీవం పట్టుతప్పి, చేతిలో నుండి జారిపోతున్నది. దేహం అంతా మంటలు పుట్టుతున్నట్లుగా ఉన్నది. శరీరమునుగాని, మనస్సునుగాని, నిలుపలేకుండా ఉన్నాను. నా మనస్సు పరిభ్రమిస్తున్నది" అని శ్రీకృష్ణభగవానుడితో అన్నాడు.

- సశేషం


నమ్మకం
ముకుంద్
ఆ! బాజీ! ఇవాళ సద్గురు పుస్తకాలు గుంటూరు పోస్టాఫీసుకి తీసుకెళ్ళాలి. నువ్వు వస్తున్నావు కదా!
1
నాకీరోజు ఒంట్లో బాగోలేదు కదా! చాలా జ్వరంగా ఉంది, కానీ తప్పదు.
అలాగేనండి!
2


ఇక్కడ తీర్థం తాగితే రోగాలు పోతాయి అంటారు కదా! నాకు ఎవరైనా ఇస్తే బాగుంటుంది.
3


ఇదిగో నాయనా! తీర్థం తీసుకో.
చేతిలో పొయ్యండి!
4


లేదు మొత్తం నీకే. తీసుకో!
5


నా అదృష్టం ఎంత బాగుందే!
6


5 నిమిషాలలోనే
నా జ్వరం
తగ్గిపోయిందే!
7


చూశారా పిల్లలూ!
భగవంతుడి దృష్టిలో
కుల-మత భేదాలు లేవు.
అంతా సమానమే.
భగవంతుడిని నమ్మిన
వాడికి బంగారు పిచ్చుక,
నమ్మని వాడికి బూడిదే!
8

# బిల్వదళం - మోక్షఫలం

సేకరణ - మురళీ

(గత సంచిక తరువాయి)

మరుసటిరోజు పూజా సమయానికి పూజకట్టు పర్యవేక్షించే అధికారి క్రితపు రోజు బిల్వదళాలు తెచ్చిన పరిచారికునితో "ఈ రోజు కూడా బిల్వదళాలు ఏర్పాటు చేయలేదు. నిన్న ఉన్న చోట మళ్ళీ వున్నాయేమో చూసిరా" అన్నారు. ఆశ్చర్యంగా ఆ రోజుకూడా అక్కడ బిల్వదళముల బుట్ట పెట్టి ఉన్నది. పూజకి వచ్చిన స్వామివారు సాభిప్రాయముగా అధికారి వంకకు చూసారు.

"అవును స్వామి ఈ రోజు కూడా అక్కడ బిల్వదళముల బుట్ట పెట్టి ఉన్నది" అన్నాడాయన. మూడవరోజు కూడా ఇదే తంతు. నాల్గవరోజు స్వామివారి ఆజ్ఞమేరకు పరిచారకుడు పొద్దున్నుండీ ఎవరికీ కనిపించని చోటు నుండి రోజూ బిల్వదళాముల బుట్ట పెట్టబడే స్థానాన్ని పరిశీలిస్తూ కూర్చున్నాడు.

సుమారు 8-8:30 గంటలకు తూర్పు పక్కనున్న మామిడి తోపు నుండి ఒక యువకుడు తలపై బుట్ట పెట్టుకుని వస్తున్నాడు. సరిగా దువ్వి ముడిపెట్టని పెద్ద శిఖ, మోకాళ్ళ పైదాక కట్టిన నీరుగావి పంచతో శుద్ధ గ్రామీణునిలా కనిపిస్తున్నాడు. అతను అటూ, ఇటూ తేరిపార చూసి తాను రోజూ పెట్టే స్థానంలో బుట్ట పెట్టి వెళ్ళబోతున్నాడు. పరిచారకులు పరుగెత్తుకుని వెళ్ళి శ్రీకార్యం వద్ద ప్రవేశపెట్టారు.

అతను భయముతో వణుకుతూ సాష్టాంగం చేసి నమస్కరించాడు. "భయపడకు. నీవేనా రోజూ ఈ దళాలు తీసుకుని వచ్చి ఇక్కడ పెట్టేది?" అన్నారు శ్రీకార్యం. అవునన్నాడు ఆ కుర్రవాడు.

"మంచిది. సాయంకాలం స్నానం చేసి, తల సరిగా దువ్వుకుని శిఖముడి వేసుకుని, మంచి బట్టలు కట్టుకుని రా! స్వామివారి దగ్గరకు తీసుకుని వెళ్తాను. ఆశీస్సులు పొందవచ్చు" అన్నారు శ్రీకార్యం. మూడు గంటలకు ఆ యువకుడు ఆజ్ఞాపించిన విధంగా వచ్చాడు.

దూరం నుండి ఆ యువకుని చూపించి ఏదో చెప్పారు శ్రీకార్యం. స్వామివారు దగ్గరకు పిలిచారు. భయపడుతూ ఎంతో వినయంగా నమస్కరించాడు ఆగంతకుడు.

"పేరేమిటి?" అని తెలుగులో ప్రశ్నించారు స్వామివారు. "పురంధర కేశవులు" అని స్వచ్ఛమైన తమిళంలో బదులిచ్చాడు. "తమిళ వాడి వలే వున్నావు, ఇక్కడికి ఎలా వచ్చావు?" అన్నారు స్వామివారు.

"నా స్వగ్రామం ఉసిలంపట్టి, మధురై దగ్గరండి. నే పుట్టిన రెండు సంవత్సరాలకే నా తల్లి గతించింది. మా నాన్నే నన్ను పెంచాడు. ఆరు ఏళ్ళ క్రితం నాతో బ్రతుకుతెరువుకై ఈ దేశం వచ్చాడు ఆయన. ఈ జమీన్ గ్రామంలో ఆవులు మేపే పనిదొరికింది. నేను చిన్నప్పటి నుండీ ఈ పనే చేస్తున్నాను. చదువుకోలేదు. మా నాన్నే నాకు ఎన్నో విషయాలు చెప్పేవాడు. ఆయనకు సంగీతంపై మక్కువ. పురంధరదాసు కీర్తనలు, త్యాగరాజ కీర్తనలు వినికిడి జ్ఞానం వల్ల పాడేవాడు. అందుకే నాకు పురంధర కేశవుడని పేరు పెట్టాడు. రెండేళ్ళ క్రితం ఆయన మోక్షానికి చేరుకున్నాడు. నాకిప్పుడు పన్నెండేళ్ళు స్వామి! ఆవుల్ని మేపుతూ ఉంటాను. జమీన్‌లో భోజనం పెట్టి జీతం ఇస్తారు" అన్నాడు.

"ఈ చుట్టుపక్కలెక్కడా మారేడు చెట్లే లేవంటున్నారు. మరి నీవెలా తెస్తున్నావు?" ప్రశ్నించారు స్వామివారు.

"ఇక్కడికి మూడు నాలుగు మైళ్ళ దూరంలో పర్వతం మొదట్లో దట్టమైన పచ్చిక, చెట్లూ ఉన్నాయి. మేము ఆవులని మేపడానికి వెళ్ళేవాళ్ళం. అక్కడ మూడు పెద్ద బిల్వ వృక్షాలున్నాయి. మానాన్న ఆ ఆకులను చూపి "ఒరే పురంధరా! ఈ మూడు ఆకులు కలిసిన దానిని బిల్వదళం అంటారురా! దీంతో శివునికి పూజ చేస్తే మహా విశేషం" అని చెప్పేవాడు.

మూడు రోజుల ముందు పూజ దగ్గర ఉండే అయ్యవారు ఇటువంటి ఆకులు కావాలని ఈ ఊరివాళ్ళకు చెబుతున్నారు. నాకు వెంటనే ఈ చెట్లు గుర్తుకువచ్చాయి. పరిగెత్తికెళ్ళి కోసుకుని వచ్చాను. అయితే గొల్లవాడు తెచ్చిన దళాలతో మీరు పూజ చేస్తారో లేదో అని ఎవరూ చూడకుండా అక్కడ పెట్టి వెళ్ళాను ఇది సత్యం స్వామి" అన్నాడు. స్వామివారు ఎంతో ప్రీతిచెందారు.

- సశేషం

# నారద భక్తి సూత్రములు

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

**భక్తి సూత్రము 22: తత్రాపి న మాహాత్మ్య జ్ఞాన విస్మృత్యపవాదః**

తాత్పర్యము: అయినప్పటికీ (ఆ దశలో కూడా) మాహాత్మ్య జ్ఞానము మరపునకు వచ్చినదన్న అపవాదు గోపికలకు లేదు.



ముందు సూత్రములో "**యథా వ్రజ గోపికానామ్**" అంటూ నిజమైన పరాభక్తికి నిదర్శనముగా నందవ్రజములోని గోపికలను ఉదహరించిన నారదుల వారు ఈ సూత్రము ద్వారా గోపికలు ఎన్నటికీ శ్రీకృష్ణుని మాహాత్మ్య జ్ఞానము మరువలేదని తెలియచేస్తున్నారు.

సాధారణంగా ప్రేమ మరియు మాహాత్మ్య జ్ఞానము పరస్పర విరుద్ధములుగా కొంతమంది భావిస్తారు అంటే మాహాత్మ్య జ్ఞానము వున్నచోట ప్రేమ ఉండదని వారి భావన. కానీ గోపికలు శ్రీకృష్ణుని పరమాత్మ స్వరూపముగా పురుషోత్తమునిగా గుర్తించినప్పటికీ ఆయనను తమ ప్రియతమునిగా భావించేవారు. నిజమైన భగవత్ప్రేమలో వున్న మాహాత్మ్య జ్ఞానము మాత్రం చెక్కుచెదరదని గ్రహించాలి. చిన్ని కృష్ణుడు లీలలు చూపించి రాక్షస సంహారము చేసిన మరుక్షణము గోపికలు ఆయనను చిన్ని బాలకుడి వలె చుట్టుముట్టి ముద్దాడి దిష్టి తీసి ఎంతో ప్రేమను చూపించేవారు. ఇది వారికి ఆయనపై పెల్లుబికే ప్రేమకు నిదర్శనమే తప్ప మాహాత్మ్య జ్ఞాన విస్మృతి కాదని నారదులు తెలియజేస్తున్నారు.

గోపికలకు ఇటువంటి అపవాదు లేదని వివరిస్తూనే వారి ప్రేమని మాహాత్మ్య జ్ఞాన విస్మృతిగా ఎవరైనా పొరపాటున పరిగణించి నప్పటికీ ఆ అపవాదు వారికి అంటదని ఈ సూత్రము ద్వారా నారదులు తీర్మానిస్తున్నారు. అటువంటి విశిష్టమైన పరాభక్తి గోపికలకు మించి మనకు ఎక్కడా కనపడదు.

**"న ఖలు గోపికా నందనో భవాన్ అఖిల దేహినాం అంతరాత్మ దృక్"** అంటూ గోపికలు శ్రీకృష్ణుడి గురించి చేసిన స్తుతిలో అఖిల దేహములలోకి అంతరాత్మమై ఉంటావని వివరిస్తూ వారికి వున్న మాహాత్మ్య జ్ఞానమును

తెలియజేస్తారు.

**భక్తి సూత్రము 23: తద్విహీనం జారాణామివ**

**తాత్పర్యము:** అట్టి మహాత్మ్య జ్ఞానము కలిగిన భగవత్ప్రేమ లేని నాడు ఆ ప్రేమ జారుల ప్రేమ వంటిదే.

ఈ సూత్రము ద్వారా నారదులు గోపికల ప్రేమను మరింత వివరిస్తూ వారికి కృష్ణునిపై ఉన్నది బ్రహ్మ భావనే తప్ప అన్య భావన కాదని తెలియజేస్తున్నారు. సర్వ సమర్పణ భావన కేవలం భగవానుని యెడల మాత్రమే సంభవమని గోపికలు మనకు తెలియజేస్తారు. "భగవానుడు నా సొంతము" అన్న పరమ పవిత్రమైన పరమాత్మ భావన గోపికల ప్రేమలో ప్రస్ఫుటముగా కనిపిస్తుంది. వారు కోరినది ఆ ప్రేమ వలన కలిగే పవిత్రమైన దివ్య ఆనందము తప్ప లౌకికపరమైనది కాదని గ్రహించాలి. గోపికల ప్రేమ గురించి శ్రీకృష్ణుడే స్వయంగా వివరిస్తూ

**"న మయ్యావేశిత ధియాం కామః కామాయ కల్పతే**
**భర్జితా క్వథితా ధానాః ప్రాయో బీజాయ నేషతే"**

అంటూ తనను చేర వచ్చిన గోపికల ప్రేమ కామము కాదని ఏ విధముగా అగ్నిలో వేయింపబడిన గింజలు మొలకెత్తవో అదేవిధంగా తనను చేరిన వారికి పునరావృత్తి దోషం ఎన్నటికీ ఉండదని తెలియ జేయడమే వారి ప్రేమకు గొప్ప తార్కాణం.

ఈ సూత్రము ద్వారా నారదులు రాసలీలలో దాగివున్న పరమ రహస్యమును తెలియజేస్తూనే దాని గురించి సామాన్యులకు ఉన్న అపోహలను తొలగిస్తున్నారు.

**భక్తి సూత్రము 24: నాస్తి ఏవ తస్మిన్ తత్సుఖ సుఖిత్వం**

**తాత్పర్యము:** అటువంటి జార ప్రేమ యందు ప్రియతముని సుఖముతో సుఖమును పొందుట ఉండదు.

నిజమైన భక్తుడు తన సుఖమును ఎన్నడూ తలపడు. తన ప్రియతమునిగా భావించిన భగవంతుని సుఖమునే తన సుఖముగా భావిస్తాడు. ఇదే గోపికల విషయంలో కూడా చెప్పబడినదని ఈ సూత్రము వివరిస్తోంది. గోపికలు సదా శ్రీకృష్ణుని సుఖమునే తమ సౌఖ్యముగా, స్వధర్మంగా భావించారు. దీనికి మనకు ఎన్నో వుదాహరణలు శ్రీమద్భాగవతంలో కనిపిస్తాయి. నంద వ్రజములో ఎక్కడ ఎప్పుడు ఏ ఆపద సంభవించినా, లేక అపశకునాలు కనిపించినా చిన్ని

కృష్ణయ్యకు ఏమయిందో అని వారి మనసులు పరితపించేవి. తన లీలల ద్వారా పరమాత్మ అని వ్యక్తమవుతూ వారిని నిరంతరం కాపాడే చిన్ని కృష్ణుని సుఖమునే తమ సుఖముగా వారు భావించారు.

సాధకుడు నిరంతరము తన గురుదేవుని పాదముల యందు మనసు నిలిపి తను, మన ధనములనూ, సర్వస్వమునూ అర్పించాలని గోపికల ద్వారా నేర్చుకొనవలసిన గొప్ప పాఠం. గీతాచార్యుడు భగవద్గీతలో తెలిపిన అనన్య భక్తిలో వారికి వారే సాటి అని ఈ సూత్రం ద్వారా అర్థమవుతుంది.

నారద భక్తి సూత్రములలో ప్రథమాధ్యాయము లోని ఈ మొదటి 24 సూత్రములు భక్తి యొక్క నిర్వచనాన్ని వివరిస్తాయి. చివరి సూత్రములలో తాను నిర్వచిస్తున్న భక్తికి నిజమైన నిదర్శనము నంద వ్రజములోని గోపికలే అని వివరిస్తూ వారి '**తదర్పిత అఖిలాచరతా**' అలాగే '**విస్మృతి లేని మాహాత్మ్య జ్ఞానము**' అంతేగాక ఆయన సుఖమునే తమ సుఖముగా భావించే అనన్య స్థితిని గురించి నారదలు వివరిస్తూ ఈ ప్రథమ అధ్యాయమును ముగిస్తున్నారు.

- సశేషం

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

***ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

ఫిబ్రవరి 2025

8 శని : భీష్మ ఏకాదశి - భక్త సహిత శ్రీ సద్గురు మూర్తి ప్రతిష్ఠ 21వ వార్షికోత్సవము. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. భక్త సమారాధన

12 బుధ: మాఘ(గురు) పూర్ణిమ. - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

22 శని : శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

26 బుధ: మహాశివరాత్రి - శ్రీ సద్గురు పాదపూజ

మార్చి 2025

14 శుక్ర; ఫాల్గుణ పూర్ణిమ, హెూలీ పండుగ - శ్రీ సద్గురు పాదపూజ

24 సోమ: శ్రీ గురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

30 ఆది: శ్రీ విశ్వావసునామ సంవత్సర ఉగాది - శ్రీ సద్గురు పాదపూజ

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**ఫిబ్రవరి 2025**

3 సోమ: వసంత పంచమి – శ్రీ సరస్వతీ పూజ,

4 మంగళ: రథసప్తమి

8 శని : భీష్మ ఏకాదశి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

12 బుధ: మాఘ(గురు) పూర్ణిమ. – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

22 శని : శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

26 బుధ: మహాశివరాత్రి – తె.జా.3.30 గం. లకు శ్రీ గురుదేవులకు బృందావనములో నమక చమక సహిత రుద్రాభిషేకము. ఉ.5.00 గం.లకు శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయములో సామూహిక ఏకాదశ రుద్రాభిషేకములు. మ.11.00 గం.లకు సహస్ర ఘటాభిషేకము, లక్ష బిల్వార్చన, భక్త సమారాధన. రాత్రి 7.00 గం.లకు శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి సామూహిక కళ్యాణ మహోత్సవం.

27 గురు: – ఉ.11.00 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.
రాత్రి 7.గం.లకు శ్రీ ఉమారామలింగేశ్వర స్వామివారి నగరోత్సవం.

28 శుక్ర: అమావాస్య

**మార్చి 2025**

2 ఆది: ఫాల్గుణ శుద్ధ తదియ – శ్రీ లలితానంద సరస్వతీ స్వామిని వారి ఆరాధన, సత్సంగం.

14 శుక్ర: ఫాల్గుణ పూర్ణిమ, హోలీ పండుగ – శ్రీ సద్గురు పాదపూజ.

24 సోమ: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

28 శుక్ర: మాసశివరాత్రి

29 శని: అమావాస్య

30 ఆది: శ్రీ విశ్వావసునామ సంవత్సర ఉగాది – ఉ. 10.00 గం.లకు పంచాంగ శ్రవణం, అనంతరం శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్‌శాఖవారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

ఫిబ్రవరి 2025

3 సోమ: వసంత పంచమి – శ్రీసద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠా దశమ వార్షికోత్సవము (2015 మాఘ శుద్ధ పంచమి) సా.5.30 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

4 మంగళ: రథ సప్తమి – ఉ.6.30 గం.లకు శ్రీ సూర్యనారాయణ మూర్తి పూజ. సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

8 శని : భీష్మ ఏకాదశి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

12 బుధ: మాఘ పూర్ణిమ. – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

22 శని : శ్రీ గురుదశమి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

26 బుధ: మహాశివరాత్రి – సా.5.30 గం.లకు, సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

మార్చి 2025

14 శుక్ర: ఫాల్గుణ పూర్ణిమ, హెూలీ పండుగ – సా.5.30 గం.లకు, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

24 సోమ: శ్రీగురుదశమి – సా.5.30 గం.లకు, సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

30 ఆది: శ్రీ విశ్వావసునామ సంవత్సర ఉగాది – సా.5.30 గం.లకు, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

## పూజ్యశ్రీ మాతాజీవారి సత్సంగ సమావేశములు

**ఫిబ్రవరి 2025 లో ........................................**

8 నుండి 12 వరకు ......................పెద నింద్రకొలనులో సత్సంగములు

19 నుండి 23 వరకు .................... గుండుగొలనులో సత్సంగములు

# మనశ్శతకము

(గత సంచిక తరువాయి)

పరశురామపంతుల లింగమూర్తి కవి

(తాత్పర్యము: కుమారి సన్నిధానం కాళీమాత)

**89. అమృత మమనస్కమవ్యయ, మమిత మనామయ మచింత్య మపరోక్ష మరూ**
**ప మమల మగమ్య తేజము, సమరసమగు రాము దలంపు సతతము మనసా.**

తాత్పర్యము: అమృతమయుడు, అమనస్కుడు, అవ్యయుడు, అమిత అనామయుడు, అచింత్యుడు, అపరోక్షుడు, అరూపుడు, అమలుడు, అగమ్య తేజుడు, సమరసుడు అగు రాముని నిత్యమూ తలచుము మనసా.

**90. కారణ కార్యములకు దా గారణమై కారణమును గడచి యవలి యోం**
**కారహకారాంతరమున గేరెడు రాముని భజింపు కృతిగొని మనసా.**

తాత్పర్యము: భజింపుము మనసాకార్య కారణములకు తాను కారణమై కారణమును మించిన 'ఓం'కార 'హ'కార అంతముల వెలిగెడు రాముని భక్తితో.

**91. నిను గూడినందుకనయము, మునుకొన సంసారజలధి ముంచితి వికనిన్**
**దునిమెద భద్రాచలరాముని గని విజ్ఞాన ఖడ్గమున నోమనసా.**

తాత్పర్యము: ఓ మనసా! ఇన్నాళ్ళుగా నీతో కూడినందుకు నన్ను సంసార జలధిలో ముంచివేశావు. అందుచే భద్రాచల రాముని తెలిసికొని, ఆ విజ్ఞాన ఖడ్గముతో నిన్ను మొదలంటా నరుకుతాను.

**92. అజపా గాయంత్రీ మంత్రజపంబున మించి మారుతముల నడచితిన్**
**భజియించెద జూడుముమా విజయ రఘూద్వహుని కరుణ వెలయగ మనసా.**

తాత్పర్యము: అజప గాయంత్రీ మంత్రజపంబున అంతకు మించిన సాధనలతో భజయింతును చూడము మీ రఘురాముని మిక్కిలి కరుణతో మనసా.

- సశేషం

(గత సంచిక తరువాయి)

# నిరీక్షణ

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్

తెలుగు అనువాదం - శశికళా దివాకర్

వాదము – జ్ఞానోదయము

ఋష్యమూక పర్వతమందు, తానున్న చోటుకు వస్తున్న వారెవరోనన్న భయంతో నిరీక్షిస్తున్న సుగ్రీవుని చెంతకు హనుమంతుడు రామలక్ష్మణులను గైకొని వెడలి, వారిని ఆతనికి పరిచయము గావించి, "వీరు అసురుడైన రావణుడి చెరనుండి సీతాదేవిని విడిపించుకొనుటలో తమ సహాయమునర్థించి ఇచ్చటకు వచ్చారు" అని తెలియజేసి నిష్క్రమించాడు. అప్పటివరకు భయంతో కూడియున్న సుగ్రీవుడు ఊరట చెంది, వాలి మూలంగా తాను పడిన కష్టములనన్నింటినీ ఏకధాటిన రామ, లక్ష్మణులకు వివరించడం మొదలుపెట్టాడు.

"నేను, నా అన్నగారు వాలి కలసి రక్తపాశంతో కిష్కింధలో జీవించిన కాలమందు గొప్ప బలశాలియైన 'మాయావి' అనబడు అసురుడు వాలిని మల్ల యుద్ధమునకు ఆహ్వానించాడు. ఇరువురికి నడుమ జరిగిన భీకరమైన మల్లయుద్ధ పోరాటమందు చేతులు కలిపిన వారిరువురూ ఒక గుహలోనికి వెళ్ళారు. అన్నగారు నన్ను గుహ వెలుపల నిలబడి నిరీక్షించమని ఆనతిచ్చారు. అలా కొన్ని దినములు గడిచిపోయాయి. ఒక దినము ఆ గుహనుండి వెలుపలికి వచ్చిన భీకర శబ్దమును విని, తన సహోదరుడైన వాలిని మాయావి సంహరించి ఉంటాడేమోనని తలచి, ఆతడు వెలుపలకు రాకుండునట్లు ఆ గుహ ద్వారమును ఒక పెద్ద బండరాయితో మూసి వేసి వెనుతిరిగాను. వానరజాతి పెద్దలు చెప్పిన మాట ప్రకారం కిష్కింధ సింహాసనము నధిష్టించాను.

అకస్మాత్తుగా ఒక దినము వాలి మా నగరమునకు వచ్చి ఆగ్రహావేశ పూరితుడై, "మోసగాడా! నన్ను గుహలో బంధించివేసి నా రాజ్యమును స్వాధీనపరచుకున్నావా" అని పలికి నన్ను హేళనకు గురిచేసి, "ఇకపై నీతో సంబంధ బాంధవ్యాలు నాకు వలదు" అని చెప్పి, నా భార్య రుమను తన వద్దనుంచుకుని నన్ను రాజ్యము నుండి బహిష్కరించాడు. నేను, నా మంత్రులు ఎంత నచ్చజెప్పజూసిననూ ఆతని ఆగ్రహం చల్లబడలేదు. అంతేగాక, నేను ఏ చోటికి వెళ్ళినా అచ్చటకు వచ్చి, నన్ను బాధించ నారంభించాడు. గతంలో వాలి దుంధుభియను అసురుని సంహరించడమేగాక ఆతని శవమును కాలితో తన్నగ, అది వెళ్ళి దగ్గరలోనున్న మాతంగముని ఆశ్రమం ముందు పడింది. అందులకాగ్రహించిన మాతంగముని, "ఎవరివలన పునీతమైన ఈ స్థలము

అపవిత్రమైనదో ఆతడు ఇచ్చట కాలిడినచో ఆతని శిరస్సు నూరు ముక్కలైపోయి, మరణించు గాక!" అని శపించారు. కావున వాలి ఇచ్చోటకు రాలేడు. అందుచేత నేను ఇచ్చట దాక్కుని జీవనము సాగిస్తున్నాను".

"రామా! మన ఇరువురి శోకము ఒకే రీతిన ఉన్నది గనుక మనం ఒక ఒప్పందం చేసుకుందాము. మొదట మీరు వాలిని సంహరించి నా భార్య రుమను నాకు అప్పగించండి. పిదప నేను మీకు సీతాదేవిని విడిపించుటలో సహాయం చేస్తాను" అన్నాడు రామునితో సుగ్రీవుడు.

"అటులనే గావింపుము..." అన్నాడు రాముడు. పిదప వారిరువురూ అగ్ని సాక్షిగ స్నేహితులయ్యారు. అదే సమయమున లంకానగర చెరసాలయందున్న సీత, వాలి మరియు రాక్షసుడైన రావణుడు ముగ్గురికీ తమ తమ ఎడమకన్ను అదిరింది.

రామునితో ఒప్పందం చేసుకున్న సుగ్రీవుడికి 'రాముడు వాలిని వధించగలడా!?' యను సందేహం కలిగింది. ఆ పర్వత ప్రాంతమందు పడియున్న దుంధుభి యొక్క కళేబరమును చూపించి, "ఎంతో దూరంలోనున్న కిష్కింధనుండి వాలి ఈ దుంధుభి శవమును కాలితో తన్నగ అది ఇచ్చటకు వచ్చి పడింది అంటే మా అన్న ఎంత బలశాలియో ఊహించవచ్చు" అన్నాడు సుగ్రీవుడు. సుగ్రీవుని అంతరంగమందలి సందేహమును గ్రహించిన రాముడు తన ఎడమకాలి చిటికెన వ్రేటితో ఆ దుంధుభి కళేబరమును తన్ని, దానిని కొన్ని యోజనముల దూరమునకు ఆవల పడునట్లు చేసాడు. 'ఇది ఇప్పుడు ఎండిపోయిన కళేబరము కదా?'యని ప్రశ్నించిన సుగ్రీవునిపై ఆగ్రహించక, "మిత్రమా! నీయొక్క భయం నాకు అర్థమగుచున్నది. నేనేమి చేసినచో మీకు నాపై నమ్మకం కలుగుతుంది? తెలియజేయుము" అని బదులిచ్చాడు రాముడు.

అప్పుడు సుగ్రీవుడు ఆ పర్వతముపై పెరుగుచున్న ఏడు పనసచెట్లను రామునికి చూపించి, "చిన్నతనమున నేను, అన్నగారు ఇచ్చటకు ఆడుకొనుటకు వచ్చేవారము. ఆ సమయమందు వాలి ఒక చెట్టును చేతితో పెకళించి, దానిని గుండ్రముగా త్రిప్పుచూ ఆడుకుంటాడు. ఆ వృక్షము వరదలో చిక్కుకున్నట్లు తిరుగుతుంది. అట్టి బలశాలి వాలి" అని తెలిపాడు సుగ్రీవుడు.

చిరుమందహాసమును తన మోమున కాన్పరచి రాముడు, తన అంబుపొదనుండి ఒక అంబును తీసి, సంధించగా అచ్చోటనున్న ఏడు పనసచెట్లు నేలకొరిగాయి. ఆ దృశ్యమును గాంచిన సుగ్రీవుడు ఆనందములో మునిగిపోయాడు.

\- సశేషం

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

తత్త్వోపదేష్ట అయిన శుకుడుకి తెలియని రహస్యమును బోధించుచున్నాడు. పరమేశ్వరుడు ఈ మాట గురుగీత యొక్క ఔన్నత్యాన్ని చాటుతున్నది.

పార్వత్యువాచ: పార్వతీ దేవి అన్నది.

**ఓం నమో దేవ! దేవేశ! పరాత్పర! జగద్గురో!**
**త్వాం నమస్కుర్వతే భక్త్యా సురాసుర నరాస్సదా. 11**
**విధి విష్ణు మహేన్ద్రాద్యైర్వన్ద్యఃఖలు సదాభవాన్**
**నమస్కరోషి కస్మైత్వం నమస్కారాశ్రయః కిల- 12**
**దృష్ట్వై తత్కర్మ విపుల మాశ్చర్యం ప్రతిభాతిమే**
**కి మేతన్న విజానే ఉ హం కృపయా వదమే ప్రభో. 13**
**భగవన్! సర్వ ధర్మజ్ఞ! వ్రతానాం వ్రతనాయకమ్**
**బ్రూహి మే కృపయా శంభో! గురుమాహాత్మ్యముత్తమమ్ 14**
**కేనమార్గేణ భోస్స్వామిన్! దేహీ బ్రహ్మమయోభవేత్**
**తత్కృ పాంకురు మే స్వామిన్! నమామి చరణౌ తవ 15**

**<u>పదవిభాగము</u>** :-

ఓం నమః-దేవ-దేవేశ-పరాత్పర-జగద్గురో-త్వాం
నమస్కుర్వతే-భక్త్యా-సురా-అసుర-నరాః-సదా; 11
విధి విష్ణు మహేంద్రాద్యైః-వంద్యః-ఖలు-సదా-భవాన్
నమః-కరోషి - కస్మైత్వం-నమస్కారాశ్రయః-కిల; 12
దృష్ట్వా-తత్కర్మవిపులం-ఆశ్చర్యం-ప్రతిభాతి-మే
కిం-ఏతత్-న - విజానే-అహం-కృపయా-వద-మే ప్రభో! 13
భగవన్-సర్వధర్మజ్ఞ-వ్రతానాం-వ్రతనాయకం-బ్రూహి
మే-కృపయా- శంభో-గురు మాహాత్మ్యం-ఉత్తమం; 14
కేన-మార్గేణ-భో-స్వామిన్-దేహీ-బ్రహ్మమయో భవేత్
తత్-కృపాం-కురు-మే-స్వామిన్-నమామి-చరణౌ-తవ; 15

**<u>టీక</u>** :- ఓం నమో దేవదేవేశ= ఓ దేవ దేవా! పరాత్పర, జగద్గురో, త్వాం=

నీకు (నిన్నుగూర్చి); సుర=దేవతలు; అసుర= రాక్షసులు; నరాః= నరులు; సదా= ఎల్లపుడు; నమస్కుర్వతే= నమస్కరించెదరు.

విధి=బ్రహ్మ; విష్ణు=విష్ణువు; మహేన్ద్రాద్యైః= మహేంద్రాదులచే; వంద్యఃఖలు= పూజింపదగినవాడవు గదా? కస్మై= ఎవరికొరకు; నమస్కరోషి = నమస్కరించుచున్నావు? ఏతత్= యీ, కర్మ=నమస్కారమనే పనినిచూచి; మే= నాకు; విపులం= మిక్కిలి; విస్మయం= ఆశ్చర్యము; ప్రతిభాతి= కలుగుచున్నది. ఏతత్=ఈ నమస్కారమునకు కారణము; కిం=ఏదో; అహం=నేను; నవిజానే= తెలుసుకోలేకపోతున్నాను; కృపయా=దయతో; హేప్రభూ=ఓ స్వామీ; మే= నాకు; వద=చెప్పుము.

భగవన్=ఓభగవంతుడా; సర్వధర్మజ్ఞ= అన్ని ధర్మములు తెలిసినవాడా; వ్రతానాం= వ్రతములలో; వ్రతనాయకం= ఉత్తమవ్రతము; ఉత్తమం= శ్రేష్టమైన; గురుమాహాత్మ్యమ్= గురుమాహాత్మ్యమును; హేశంభో=ఓం శంభూ! మే= నాకు; కృపయా= దయతో; బ్రూహి= చెప్పుము. భోస్వామిన్= ఓ స్వామీ; కేనమార్గేణ= ఏమార్గము చేత; దేహీ= జీవుడు; బ్రహ్మమయః= బ్రహ్మమయుడుగా; భవేత్= అవుతాడో; తత్= ఆ విషయమును; కృపాం=దయతో; స్వామి=స్వామీ; మే=నాకు; కురు=(దయ) చేయుము; తవ=నీ; చరణౌ= పాదయుగమునకు; నమామి= నమస్కరించుచున్నాను.

**వ్యాఖ్య** :- "పరాత్పరుడవైన ఓ దేవ దేవేశా! దేవతలు, రాక్షసులు, నరులు ఎల్లపుడు భక్తితో తమకు నమస్కరించెదరు. మీకు బ్రహ్మ, విష్ణువు, ఇంద్రాది దేవతలు ఎల్లప్పుడూ మ్రొక్కులు చెల్లింతురు. అటువంటి తమరు ఎవరికి నమస్కరిస్తున్నారు? ఇది నాకు చాలా విస్మయాన్ని కల్గిస్తున్నది. ఈ మీ నమస్కారానికి కారణంఏమిటి? ఈ మీ నమస్కారం ఎవరికి? దయచేసి నా సంశయాన్ని తీర్చండి. తరువాత, వ్రతములలో వ్రతనాయకం అని అనబడే సద్గురు వ్రతాన్ని, గురుమాహాత్మ్యాన్ని నాకు అనుగ్రహించండి. దేవా! తమ పాద పద్మాలకు నమస్కరించి అడుగుతున్నాను, ఏ మార్గాన్ని అనుసరించి జీవుడు బ్రహ్మమయుడుగా కాగలడో ఆ మార్గాన్ని నాకు తెలియజేయండి" అని పార్వతి భక్తితో పరమేశ్వరుడిని ప్రార్థించింది.

- సశేషం

# అన్నదాతవయ్యా!

- పెనుమాక నాగేశ్వరరావు

అన్నదాతవయ్యా  ఆనందనిలయా
అన్నదాతవయ్యా  ఆనందనిలయా
ఆకలెరిగిన అమ్మవయ్యా   మా  ఆకలెరిగిన అమ్మవయ్యా
నీ సుప్రసాదము బహు  కమ్మనయ్యా
అది భవరోగములను  బాపునయ్యా ॥అన్నదాతవయ్యా॥

నమ్మి వచ్చిన వాళ్ళకి, అలిసొచ్చిన వాళ్ళకి
కలిసొచ్చిన దైవానివయ్యా కదలి వచ్చిన  దైవానివయ్యా
ఆకలితో వచ్చే వాళ్ళకి, ఆశలతో వచ్చే వాళ్ళకీ
ఎదురొచ్చే దైవానివయ్యా ఆధరువందించే దైవానివయ్యా ॥అన్న॥

అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు కదయ్యా
నువ్వెట్టిన అన్నమే మాకూ పంచభక్ష్య పరమాన్నమయ్యా
కడుపారా తినిపిస్తావయ్యా, కడుపునింపి పంపిస్తావయ్యా
ఆదరించి ఆకలి తీర్చే  ఆ పరబ్రహ్మవు నీవే నయ్యా ॥అన్న॥

ఇది మనిషికి దేవుడు  ఇచ్చే  ఆతిధ్యం
మనసున్న మనుషుల  నేపధ్యం
అనితర సాధ్యం మాతాజీ సారధ్యం
అది బాబూజీ అందించిన సామర్థ్యం ॥అన్న॥

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీబుల్లిమామయ్య తెలిపిన శ్రీబాబు లీలలు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

18. సీతారామయ్యగారు ఒక కోర్టుకేసులో యిరుక్కుని పదిహేను సంవత్సరాలు అవస్థ పడ్డారు. ఒకసారి వాయిదా వుందని హైదరాబాదు వెళ్ళటానికి రైలు కోసం నిరీక్షిస్తూ బెజవాడ ప్లాట్‌ఫారం మీద దిగులుగా శ్రీ బాబు స్మరణతో కూర్చుని ఉన్నారు. ఎక్కడి నుండి వచ్చారో శ్రీబాబు, వారి వద్దకు వచ్చి "బుల్లి మామయ్యా! దిగులు పడకు. ఈ వాయిదాతో తేలిపోతుందిలే. నువ్వే గెలుస్తావు" అని చెప్పి, సీతారామయ్యగారు "బాబూ! బాబూ!" అంటుండగానే వెళ్ళిపోయారు.



హైదరాబాదులో కేసు వాయిదా రోజున విచారణకు వచ్చినపుడు, అనుకోకుండా ప్రధాన న్యాయమూర్తి రామచంద్రారెడ్డి గారు వచ్చి జోక్యం చేసుకుని, ప్రతివాది తరపు సాక్ష్యులను తానే క్రాస్ పరీక్షచేసి, తప్పు ఒప్పించి కేసు చెల్లదని కొట్టి వేశాడు. సీతారామయ్యగారు సంతోషంతో వెంటనే శ్రీ బాబు వద్దకు వెళ్ళి కోర్టులో జరిగిన విషయం చెప్పి, "మీరు చెప్పినట్లే జరిగింది బాబూ! మీరే కేసు గెలిపించారు" అన్నారు.

శ్రీ బాబు నవ్వుతూ "నేను చెప్పటమేమిటి?" అని అడిగారు. సీతా రామయ్యగారు స్టేషనులో జరిగిన విషయం చెప్పారు. శ్రీ బాబు "అలాగా! అయితే సర్వ సృష్టికి అధిష్ఠాన న్యాయమూర్తి భగవానుడే, అలా నీకు బెజవాడ స్టేషనులో నా రూపంలో కనిపించి చెప్పి, మళ్ళీ హైదరాబాదులో హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తి రామచంద్రారెడ్డి రూపంలో తీర్పు చెప్పి నిన్ను గెలిపించి ఉంటాడు. నాకేమీ తెలియదు" అన్నారు. సీతారామయ్య గారు "అవును బాబూ! ఇప్పుడు మాట్లాడుతున్నది కూడా ఆ సర్వాధిష్ఠాన న్యాయమూర్తే!" అన్నారు. శ్రీ బాబు "ఏమో మరి!" అన్నారు.

19. శ్రీబాబు భక్తులందరితోను శ్రీశైలంలో ఉన్నారు. గుంటూరువారి సత్రంలో ప్రతిరోజూ రాత్రి పూట శ్రీబాబు అనుగ్రహ భాషణ చేస్తుండేవారు.

ఒకరోజు రాత్రి శ్రీబాబు వేదికపై ఆసీనులై ఉండగా, భక్తులందరు నమస్కారాలు చేసుకున్నారు. చివరికొక కాషాయాంబరం ధరించిన స్త్రీ నమస్కారం చేసుకొని, ప్రక్కకు వెళ్ళి నిలబడి శ్రీ బాబును పరిశీలనగా చూడటం మొదలు పెట్టారు.

శ్రీ బాబు తమ సంభాషణ ప్రారంభించబోతూ, ఆమెను చూసి "అమ్మా! ఇలా రండి" అని పిలిచి, "వీడిని చూసి, ఈయన స్వాముల వారా? ఇలా అని విభూతి, అలా అని ఉంగరము తీసి యివ్వగలరా?' అనుకుంటున్నారు కదూ? చెయ్యి పట్టండి. (అని ఆమె చేతిలో ఒక గుప్పెడు విభూతి పోసి) ఏమున్నది తల్లీ యిందులో? మీరు కూడా యిలా తీసి యిస్తారు గదా? దీని రహస్యం మీకు తెలియనిదా? నాకు తెలియనిదా? కాని యీ విద్యలు చూపించిన వారిని గాని, చూసిన వారిని గాని తరింప జేయగలవా?

సువర్ణము అంటే బంగారము మాత్రమే కాదు 'సు' అంటే ఆత్మవస్తువు. వట్టి బంగారమును గాక ఆత్మ జ్ఞానమనే సువర్ణాన్ని అందించ గలిగిన వాడే నిజమైన సాధువు. విభూతి, లేక భస్మము అంటే ఐశ్వర్యము - ఈశ్వరుడు ధరించేది. వట్టి భస్మమునుగాక, భస్మధారి అయిన పరమ శివుని తత్త్వమును అందించ గలవాడే నిజమైన సన్న్యాసి. అతనికి బంగారము కూడా భస్మముతో సమానమే.

సాధకుడు నియమ నిష్ఠలతో సాధన చేస్తున్నపుడు యిటువంటి సిద్ధులు సహజంగా వస్తాయి. వాటి భ్రాంతిలో పడినవాడు అధోగతి పాలౌతాడు. కాని ఆ భ్రాంతిలో పడక అనన్య దృష్టితో సాధన కొనసాగించిన వారే లక్ష్యార్థమును సాధించగలరు. గమ్యం చేరుకోగలరు. భగవానుడు మీకు అటువంటి అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యాలను ప్రసాదించు గాక!" అని ఆశీర్వదించారు.

- సశేషం

## విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

# కనకదాస్

పవిత్ర తీర్థాలను దర్శించాలనే కోరిక కనకదాసుకు కలిగి, గురుదేవుల అనుమతి పొంది, తీర్థయాత్రలకు బయల్దేరాడు. అనేక పుణ్య నదులలో స్నానంచేసి, అనేక క్షేత్రాలను దర్శించి, తిరుపతికి వచ్చాడు. తమ భక్తులైన బీరప్ప, బుచ్చెమ్మల ముద్దుబిడ్డ అయిన కనకదాసు తన దర్శనానికి వస్తున్నాడని గ్రహించిన శ్రీనివాసుడు దేవాలయ మహంతుకు స్వప్నంలో కనిపించి "కనకదాసుని సగౌరవంగా సత్కరించ"మని చెబుతాడు. నిరాడంబరంగా వస్తున్న కనకదాసుని ఆ మహంతు గుర్తించ లేకపోతాడు. స్వామి ఆలయం వద్ద వేచి ఉన్న కనకదాసుకు స్వామి దర్శనం కాలేదు. ఆయన ఆలయం ముందే పడుకొని ఉంటాడు. ఆ సమయంలో స్వామి ఆభరణాలు అదృశ్యమవుతాయి. ఆలయం ముందున్న కనకదాసుని అనుమానించి, అతనిని బంధించి న్యాయాధీశునికి అప్పగిస్తారు. కనకదాసుని త్రాటితో స్థంభానికి కట్టివేసి, కొరడాలతో బాదుతారు. కనకదాసు ఆ దెబ్బలకు తాళలేక మూర్ఛపోతాడు. దీనదయాళుడు అయిన తిరుమల గిరీశుడు మహంతుకి దర్శనమిచ్చి, "కనకదాసుని నేను సత్కరించమని ఆదేశిస్తే అతనిని శిక్షిస్తారా?" అని మహంతుపై తన కోపాన్ని ప్రదర్శించాడు. మహంతు వచ్చి, కనకదాసుని విడిపించి, అతని పాదాలపై పడి



క్షమాభిక్షనర్థించాడు. మహంతు కనకదాసుని తీసికొని తిరుమలేశుని దర్శనానికి వెళ్ళాడు. దేవాలయం తలుపులు తీయగానే స్వామి పోయిన ఆభరణాలతో సహా దర్శనం ఇచ్చాడు. కనకదాసు చేతులు జోడించి, "ప్రభూ! నీ లీలలు మాకు అర్థం కావు. నీవు భక్తులను ఉద్ధరించే తీరు పరమాద్భుతము. ఆభరణముల అపహరణలో దాగి ఉన్న నీ ఆశ్రిత జన రక్షణకు ఇది నిదర్శనం" అని కొనియాడాడు.

కనకదాసు భగవంతుని దివ్యనామం చేస్తూ భగవానుని కృపారసాన్ని పానం చేస్తూ, ఉడిపిలో ఉన్న శ్రీకృష్ణుని ఆలయానికి చేరుకొన్నాడు. ఆలయంలో ప్రవేశించటానికి వీలు లేదని ధర్మకర్తలు ఆపారు. కనకదాసు పొంగి పొరలి వస్తున్న దుఃఖంతో శ్రీకృష్ణుని, దర్శించని తన జన్మ నిరర్థకం అని భావించాడు. శ్రీకృష్ణుని దర్శనానికి అవకాశం కల్పించమని ధర్మకర్తలను అర్థించాడు. కాని కఠిన హృదయులైన ధర్మకర్తలు అతని ప్రార్థనను అంగీకరించలేదు.

చెదరిన హృదయంతో కనకదాసు ఆలయం వెనకభాగం వైపుకు వెళ్ళి దుఃఖించసాగాడు. శ్రీకృష్ణుని మనస్సు ద్రవించింది. దేవాలయ గర్భగుడి వెనకవైపు గోడ కదిలి పడిపోయింది. తూర్పుముఖంగా ఉన్న భగవానుడు పడమర వైపుకు తిరిగి కనకదాసుకు దర్శనం ఇచ్చాడు. దీనిని ఇప్పటికీ "కనకభండి' అని పిలుస్తారు. అంటే కనకదాసు స్వామిని దర్శించిన కిటికీ అని అర్థం.

భగవంతుని కృపకు పాత్రుడైన కనకదాసు తొంభై సంవత్సరాలు జీవించి, భగవత్సాయుజ్యం పొందాడు. కొన్ని వేల కీర్తనలను రచించాడు. మానవాళిలో భక్తి ప్రబోధం చేశాడు. ఆది కేశవుని నమ్మి తాను తరించటమే కాక అనేకమందిని తరింపజేశాడు. భక్తాధీనుడైన భగవంతుని దర్శనం ముక్తికి దారి తీస్తుంది. అట్టి భక్తులు నడిచిన మార్గంలో పయనించే వారికి ముక్తిపథం కరతలామలకం!

# శ్రీ కాళీ వనాశ్రమ శాఖ, భీమవరము,
# పశ్చిమ గోదావరి జిల్లా (ఆం.ప్ర)
## శ్రీగురుదేవుల ప్రతిష్ఠా మహోత్సవం

శ్రీగురుదేవుల ప్రతిష్ఠా మహోత్సవం - భీమవరం పట్టణములో శ్రీగురుదేవుల బృందావన నిర్మాణము త్వరితగతిన జరుగుతున్న విషయం భక్తులందరికీ తెలిసినదే. వచ్చే మాఘమాసము నాటికి పూర్తి కాగలదని ఆశిస్తున్నాము. ప్రతిష్ఠామూర్తులు కూడా తయారయ్యి భీమవరం చేరుకున్నాయి. అందువలన దైవజ్ఞులచే ప్రతిష్ఠా ముహూర్తము నిర్ణయించబడినది.



10-03-2025 సోమవారం ఉదయం 6-39గం.లకు ఆశ్రమ ప్రధాన కేంద్రం నుండి జ్యోతిని భీమవరం శాఖకు తీసుకు వస్తారు. 11-03-2025 భీమవరంలో శోభాయాత్ర. ది.12.03.2025 బుధవారము ఉ.10.42 గం.లకు గృహప్రవేశము, అనంతరం యాగశాలా ప్రవేశము, మండపారాధనలు ది.13.03.2025 నుండి యాగము, అధివాసములు. ది.17.03.2025 సోమవారము ఉ.10.22 గం.లకు శ్రీ గురుదేవుల అభయ క్షీర శిలామూర్తి ప్రతిష్ఠ జరుగును. భక్తులందరూ ఈ కార్యక్రమములో పాల్గొన వలసినదిగా ఆహ్వానిస్తున్నాము. భవన నిర్మాణమునకు ఇప్పటికే కొంతమంది భక్తులు తమ సహాయం అందించారు. నిర్మాణమునకు అవసరమైన నిధులు ఇంకా సమకూరలేదు. ఉదార హృదయులైన భక్తులందరూ యథాశక్తి తమ సహాయ సహకారములు అందించ వలసినదిగా ప్రార్థిస్తున్నాము.

ముఖ్యవిషయం: ప్రతిష్ఠానంతరం బృందావనంలో నిత్యసేవకు నెలకు ఇద్దరు చొప్పున 12 నెలలకు అవసరం ఉంటుంది. నిత్యసేవ చేసుకునే ఆసక్తిగల భక్తులు ముందుగానే తమ పేర్లు నమోదు చేసుకొనవలసినదిగా ప్రార్ధన. జైగురుదేవ్.

భక్తులు యిచ్చు విరాళములకు ఐ.టి. యాక్ట్ 80జి క్రింద పన్నురాయితీ లభించును. విరాళములు ఈ క్రింది బ్యాంక్ ఎకౌంటుకు పంపవలెను.

Sri SriSri Hanumath Kali Vara Prasad Babu Trust
Bank of Baroda, Bhimavaram Branch
SB Account No.69900 1000 00 172
IFSCode: BARB0BHIMAV

మరింత సమాచారము కొరకు:

మురళీ - 93983 34345, తుమలపల్లి శివ: 96181 99556

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## శ్రీ కాళీవనాశ్రమమునందు నిర్వహించిన శ్రీ సద్గురు మహరాజ్ వారి 36వ వార్షిక పుణ్యారాధన మహోత్సవ దృశ్యములు



సద్గురు దేవులకు
లక్ష నామార్చన



శ్రీ మాతాజీవారిచే
తీర్థ వితరణ



శ్రీ సద్గురు
పాదుకా ప్రదక్షిణ



శ్రీ సద్గురు దేవులకు
ఊంజలసేవ

REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26

## శ్రీ కాళీవనాశ్రమమునందు నిర్వహించిన శ్రీ సద్గురు మహరాజ్ వారి 36వ వార్షిక పుణ్యారాధన మహోత్సవ దృశ్యములు



శ్రీ సద్గురు దేవుల రథోత్సవం



శ్రీ సద్గురు దేవులకు నమక, చమక సహిత మహాభిషేకం



శ్రీ సద్గురు దీక్షానంతర హోమం

If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.